



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మంత్రి తుమ్మల

కొత్తగూడెం ఇంజనీరింగ్ కాలేజీని
అప్‌గ్రేడ్ చేయండి

- యూనివర్సిటీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్‌గా మార్చాలి
- ముఖ్యమంత్రికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వినతి

ఖమ్మం/కొత్తగూడెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కొత్తగూడెంలోని కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలను ఎర్త్‌సైన్సెస్ యూనివర్సిటీగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం అందించారు. ఇందుకు సీఎం సానుకూలంగా స్పందించారని మంత్రి తెలిపారు. కొత్తగూడెంలో అనేక పరిశ్రమలున్నాయని, సింగరేణి కాలరీస్ ప్రధాన కార్యాలయం కూడా కొత్తగూడెంలో ఉందని, టీఎస్ జెన్‌కో, నవభారత్ వెంచర్స్, బయ్యారం మైన్స్, మైలారం కాపర్‌మైన్స్, ఎన్ఎండీసీ వంటి పరిశ్రమలున్నాయని, ప్రస్తుతం అక్కడ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల నడుస్తోందని, దీనిని యూనివర్సిటీ ఆఫ్ ఎర్త్‌సైన్సెస్‌గా అప్‌గ్రేడ్ చేయాలని విజ్ఞప్తిచేశారు. గ్రీన్‌ఫీల్డ్, నేషనల్ హైవేలతో రవాణా వ్యవస్థ అనుసంధానం అవుతుందని, కొత్తగూడెంలో విమానాశ్రయ ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయని రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల విద్యార్థులకు యూనివర్సిటీ ఆఫ్ ఎర్త్‌సైన్సెస్ ఏర్పాటుచేస్తే సౌలభ్యంగా ఉంటుందని మంత్రి తుమ్మల సీఎంకు సూచించారు.

యూనివర్సిటీగా మార్చడం ద్వారా యూజీ, మాస్టర్స్, పీహెచ్‌డీలలో భూగర్భశాస్త్రం, ఎన్విరాన్‌మెంటల్ సైన్సు, జియోఫిజిక్స్, జియోకెమిస్ట్రీ వంటి ప్రోగ్రాంలు అదనంగా చేర్చాలని సూచించారు. తద్వారా దేశంలోనే మొట్టమొదటి యూనివర్సిటీగా కొత్తగూడెం యూనివర్సిటీ ఆఫ్ ఎర్త్‌సైన్సెస్ గుర్తింపు పొందుతుందని తెలిపారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి విద్యార్థుల నైపుణ్య పెరుగుదలకు, పర్యావరణ ప్రగతికి ఈ యూనివర్సిటీ ద్వారా మెరుగైన విద్య అభించే అవకాశం ఉందని తద్వార కొత్తగూడెం ప్రాంతం పారిశ్రామికంగా, విద్యాపరంగా అభివృద్ధి సాధిస్తుందని మంత్రి తుమ్మల సీఎంకు వివరించారు.

ఆళ్వార్ల వైభవంపై ప్రవచనాలు

- రేపటి నుంచి 10 వరకు నగరంలో ఆధ్యాత్మిక గుబాళింపు
- వివిధ రాష్ట్రాలనుంచి తరలిరానున్న వేద పండితులు
- 12 అంశాలపై ప్రసంగించనున్న 12 మంది 7

కొత్త ఇళ్లు వచ్చేనా..?

- గత ప్రభుత్వ హయాంలో ఎంపికైన లబ్ధిదారుల్లో అయోమయం 6
- పాత ప్రొసీడింగ్స్‌ను రద్దు చేసిన కాంగ్రెస్ సర్కారు

'సర్వే'ంతర్యామి...



ఖమ్మం రూరల్ మండలం పెద్దతండాలో సమగ్ర సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఇంటింటి సర్వే షురూ

ఇంటింటి సమగ్ర సర్వే జిల్లా వ్యాప్తంగా బుధవారం ప్రారంభమైంది. తొలిరోజు ఇళ్ల గుర్తింపు ప్రక్రియను చేపట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో 3,33,394 ఇళ్లు, పట్టణ ప్రాంతాల్లో 2,02,941 ఇళ్లు మొత్తంగా 5,36,335 ఇళ్లకు గాను సర్వే మొదలైంది. తొలిరోజున గ్రామీణ ప్రాంతాల్లో 3,31,012 ఇళ్లు, పట్టణ ప్రాంతాల్లో 44,861 ఇళ్లు మొత్తంగా 3,75,873 ఇళ్లను గుర్తించే ప్రక్రియను ఎన్యుమరేటర్లు చేపట్టారు. 3654 బ్లాకులకు గాను 3035 బ్లాకుల్లో ప్రక్రియను పూర్తి చేశారు. బ్లాకుల పరిధిలోని ఇళ్లను గుర్తించి స్టిక్కరింగ్ చేశారు. మొత్తంగా ఈ ప్రక్రియ జిల్లాలో 70 శాతం జరిగింది. అయితే సర్వేలో ప్రజల నుంచి సేకరించే ప్రశ్నావళిపై పూర్తి స్థాయి స్పష్టత రాకపోవడంతో ఇంటింటి సర్వేను ఇంకా మొదలుపెట్టాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ వస్తే శుక్రవారం నుంచి సర్వే సిబ్బంది ఇళ్లలోని యజమానులను కలుసుకుని ప్రశ్నల వారీగా సమగ్ర వివరాలను సేకరించనున్నారు. మొత్తంగా శుక్రవారం నుంచి సర్వే ఊపందుకోనుంది.

ప్రజలు నిర్భయంగా సర్వేలో పాల్గొనాలి

- ధ్రువీకరణ పత్రాలు ఇవ్వటం తప్పనిసరి కాదు
- సర్వేపై ఫిర్యాదుల స్వీకరణకు హెల్ప్ డెస్క్ 1077 నెంబర్
- మొదటి విడతలో స్టిక్కరింగ్, రెండో విడతలో సర్వే 6
- జిల్లా అదనపు కలెక్టర్, కేఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ శ్రీజ



సర్వే తీరుపై వివరిస్తున్న శ్రీజ

- తొలిరోజు ఇళ్ల గుర్తింపు ప్రక్రియ 70.65 శాతం పూర్తి
- ఇంటింటికీ స్టిక్కరింగ్ చేసిన సర్వే సిబ్బంది
- వివిధ ప్రాంతాల్లో పరిశీలించిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్
- రేపటి నుంచి వివరాల సేకరణ



మధిరలో ఇంటింటి స్టిక్కరింగ్ వేస్తున్న ఆర్డీవో నర్సింహారావు

ఖమ్మం కలెక్టరేట్/ఖమ్మం రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇంటింటి సర్వే ప్రక్రియను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఖమ్మం రూరల్ మండలం పెద్ద తండాలో, సాయంత్రం వేళ ఖమ్మం నగరంలోని 53వ డివిజన్ ద్వారకా నగర్‌లో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నవంబరు 6 నుంచి 8 వరకు హౌస్ లిస్టింగ్ పూర్తి చేసి ప్రతి ఇంటికి స్టిక్కర్ అంటించాలని సూచించారు. సర్వేకు సంబంధించి పక్కాగా షెడ్యూల్ రూపకల్పన చేయాలని, ఏ రోజు ఎక్కడ సర్వే చేపట్టేది ముందుగా సమాచారం ఇవ్వాలని, కావాల్సిన వివరాలు సిద్ధం చేసుకునేలా చూడాలని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీజ, ఖమ్మం నగరంలో జడ్పీ డిప్యూటీ సీఈవో నాగలక్ష్మి, మధిరలో ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, పాలేరులో అదనపు ఆర్డీవో నూరోద్దీన్, సత్తుపల్లిలో కల్లూరు ఆర్డీవో రాజేందర్, వైరాలో డీఎల్పీవో రాంబాబు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ప్రజలు సహకరించాలి...

ఇంటింటి సర్వేకు ప్రజలు సహకరించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కోరారు. ఖమ్మం రూరల్ మండల పరిధిలోని పెద్దతండాలో బుధవారం ఇంటింటి సర్వేను పరిశీలించారు. ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ప్రజలు పాల్గొని వివరాలు అందించాలన్నారు. దీని వలన పథకాలు రద్దు అవుతాయని ఎటువంటి అపోహలు వద్దని తెలిపారు. సర్వేలో పాల్గొంటున్న సిబ్బంది 8 వరకు హౌస్ లిస్టింగ్ పూర్తి చేసి ప్రతి ఇంటికి స్టిక్కర్ అంటించాలన్నారు. ఏరోజు ఎక్కడ సర్వే చేపట్టేది ముందుగా సమాచారం అందించాలన్నారు.

ఈ సందర్భంగా వరదల వలన నష్టపోయిన బాధితులు కలెక్టర్‌ను కలిశారు. జిల్లాలో దాదాపు 25 వేల కుటుంబాలకు పరిహారం అందించామన్నారు. పెద్దతండాలో 838 కుటుంబాలకు పరిహారం అందిందన్నారు. పరిహారం అందనివారు దరఖాస్తు సమర్పిస్తే అధికారులచే విచారించి అర్హులైనవారికి పరిహారం అందిస్తామన్నరు. జ్యోతి అనే మహిళ.. వరదల్లో తన పశువులు, మేకలు కొట్టుకుపోయాయని, వాటికి పరిహారం అందలేదని తెలియచేయగా విచారించి పరిహారం అందేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో నూరోద్దీన్, ఎంపీడీఓ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



మద్యం సరఫరాకు బ్రేక్

- ధరలు పెంచేందుకేనని ఊహాగానాలు

వైరా, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా నిలిచిన మద్యం సరఫరాపై రకరకాల అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణలో మద్యం ధరలు పెంచే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందా.. లేక నిజంగానే సాంకేతిక సమస్యలతో మద్యం సరఫరా నిలిచిపోయిందా.. అనేది సస్పెన్సుగా మారింది. మంగళ, బుధవారాల్లో తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలతోపాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కూడా వైన్‌షాపులకు మద్యం సరఫరా నిలిచిపోయింది. ఫలితంగా రూ.15 కోట్ల నుంచి 20 కోట్ల రూపాయల హోల్‌సేల్ మద్యం సరఫరా నిలిచిపోయింది. మంగళవారం ఉదయం కొద్దిసేపు మాత్రమే మద్యం సరఫరా ప్రక్రియ కొనసాగింది. ఆ తరువాత సాంకేతిక సమస్య (మిగతా 6వ పేజీలో)

విస్తరణే లక్ష్యంగా వందేళ్ల సంబురం

- ప్రజలు కమ్యూనిస్టుల అవసరాన్ని గుర్తించారు : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



ఖమ్మం టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజలు కమ్యూనిస్టుల అవసరాన్ని గుర్తించారని, అందుకు అనుగుణంగా పార్టీని బలోపేతం చేసి, విస్తరణే లక్ష్యంగా వందేళ్ల సంబురం నిర్వహిస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. ఖమ్మంలోని సీపీఐ జిల్లా కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో బుధవారం పగడాల మల్లేష్ అధ్యక్షతన జరిగిన సీపీఐ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆవిర్భావంతోనే సీపీఐ అనేక నిర్బంధాలను ఎదుర్కొందన్నారు. కమ్యూనిస్టులు లేకుంటే ప్రస్తుత కాశ్మీర్‌లా దేశం నడిబొడ్డున తెలంగాణ రగులుతుండేదని కూనంనేని పేర్కొన్నారు. 4వేల మంది బలిదానంతో తెలంగాణ స్వరూపాన్ని, జీవనశైలిని మార్చటంతో పాటు పేదలు తలెత్తుకునేలా చేసిందన్నారు. 99సంవత్సరాల సుదీర్ఘప్రస్థానంలో ఎన్నో పోరాటాలు నిర్వహించి విజయాలు సాధించామని తెలిపారు. మారిన రాజకీయ పరిస్థితులు, (మిగతా 6వ పేజీలో)

పరీక్షల బిల్లుల్లోనూ కక్కుర్తి

- సొంత అకౌంట్లో డబ్బులు జమ చేయించుకున్న వైనం
- ఎస్ఆర్‌అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల సిబ్బంది నిర్వాకం
- దర్జాగా నిబంధనల బేఖాతరు.. చోద్యం చూసిన ప్రిన్సిపాల్

ఇదేం పని సారూ..



ఖమ్మం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలో ఆదర్శ కళాశాలగా పేరొందిన ప్రభుత్వ ఎస్ఆర్‌అండ్‌బీజీఎన్ఆర్ కళాశాలలో అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. విద్యార్థుల యూనిఫామ్, పరీక్షల ఫీజుల వసూళ్లలో అక్రమాలు చోటుచేసుకుంటున్నట్టు 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం ప్రత్యేక కథనం ప్రచురితమైన విషయం విదితమే. ఈ నేపథ్యంలో తాజాగా పరీక్షల నిర్వహణకు సంబంధించిన బిల్లుల విషయంలో కూడా అక్రమాలు జరిగినట్టు ఆధారాలు చిక్కాయి.

ఎస్ఆర్‌అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల ప్రస్తుతం అటానమస్ హోదా పొందిన విషయం విధితమే. గతేడాది వరకు పీజీ పరీక్షల నిర్వహణ యూనివర్సిటీ నుంచే జరిగేది. సాధారణ, ప్రాక్టికల్ పరీక్షలు ఇక్కడి ఎగ్జామినేషన్ విభాగం వారే చూసేవారు. పరీక్షల నిర్వహణకు అయిన ఖర్చు వివరాలను కళాశాల ప్రిన్సిపాల్ యూనివర్సిటీకి లేఖ రాస్తే, ఆ లేఖ ఆధారంగా యూనివర్సిటీ వారు సంబంధిత మొత్తాన్ని నేరుగా కళాశాల అకౌంట్లోకి జమచేసేవారు.

కానీ ఎస్ఆర్‌అండ్‌బీజీఎన్ఆర్ కళాశాలలో మాత్రం పరీక్షల నిర్వహణ బాధ్యతలను చూసే లెక్చరర్ ఒకరు కళాశాల అకౌంట్‌ను పక్కనపెట్టి సొంత అకౌంట్‌లో జమ చేయించుకున్నారు. హెడ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో కళాశాల అకౌంట్ ఉండగా, ప్రాక్టికల్ పరీక్షలకు సంబంధించిన నగదు రూ. 75 వేలను ఈ ఏడాది ఆగస్టులో ఎన్నెస్పీ రోడ్డులోని ఎస్‌బీఐలో తన అకౌంట్లో నగదు జమచేయించుకున్నారు. గత కొంతకాలంగా పరీక్షల నిర్వహణకు సంబంధించిన లక్షల రూపాయల నిధులను సొంత అకౌంట్లోకి జమ చేయించుకుంటున్న సదరు లెక్చరర్ తనకు ఇష్టం వచ్చినప్పుడు ఇన్విజిలేటర్లకు చెల్లింపులు జరిపేవారని తెలిసింది. అకౌంట్లో నగదు జమ అయినప్పటికీ ఇంకా నగదు పడలేదని చెబుతూ ఆ తర్వాత ఎంతోకొంత చేతిలో పెట్టి మమ అనిపించేవాడని తెలిసింది.

కాగా అసలు కళాశాల అకౌంట్లోకి జమ చేయాల్సిన బిల్లులను సొంత అకౌంట్లోకి జమ చేయించుకోవడం వెనుక అంతర్యమేంటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సొంత అకౌంట్లో జమ అవుతున్నప్పుడు కళాశాల ప్రిన్సిపాల్‌కు తెలియకుండా ఎలా ఉంటుందన్న వాదన లేకపోలేదు. యూనివర్సిటీ వారు సైతం ఉద్యోగి అకౌంట్లోకి ఎలా జమచేశారన్న విషయం ప్రస్తుతం కళాశాలలో చర్చనీయాంశంగా మారింది. ఎన్నేళ్ల నుంచి ఇలా జరుగుతోంది... ఇందులో ఎంతమొత్తం అవినీతి జరిగిందనేది అధికారులు విచారణ జరిపితే బయటపడుతుంది.

దైన్యం బతుకులు



ధాన్యం రైతుకు తేమ దెబ్బ

- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కొర్రీలు
- తేమ పేరుతో పంటను తిప్పిపంపుతున్న నిర్వాహకులు
- వాతావరణ భయంతో ప్రైవేటు మిల్లర్లకు విక్రయిస్తున్న రైతులు
- బోనస్ వస్తుందని చెప్పినా పట్టించుకోని వైనం
- జిల్లాలో పూర్తిస్థాయిలో ప్రారంభంకాని కొనుగోలు కేంద్రాలు

ఖమ్మం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా రైతన్నకు తేమ నిబంధనలు శాపంగా మారాయి. జిల్లాలో సహకార సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, డీసీఎంఎస్ ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేశారు. అయితే ప్రస్తుతం ధాన్యంలో తేమశాతం అధికంగా ఉండడంతో కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు ముందుకు సాగడం లేదు. రైతులు తెస్తున్న ధాన్యంలో తేమశాతం 17నుంచి 24శాతం వరకు ఉంటోంది. దీంతో ధాన్యాన్ని మళ్లీ ఆరబెట్టుకుని తీసుకురావాలని తేమ 14నుంచి 17శాతంలోపే ఉండాలని కొనుగోలు కేంద్రంలోని సిబ్బంది చెబుతున్నారు. దాంతో రైతులు అక్కడే ప్లాట్‌ఫారాలపై ధాన్యం ఆరబోస్తున్నారు. ఈలోగా ప్రైవేటు వ్యాపారులు వచ్చి ఆ ధాన్యాన్ని కొనుగోలు చేసి తరలిస్తున్నారు. బోనస్ రూ.500అదనంగా ఇస్తామన్నా రైతులు రిస్క్ తీసుకునేందుకు ఇష్టపడడం లేదు. పొలాల్లో మిషన్ల ద్వారా కోసిన ధాన్యాన్ని వెంటనే కేంద్రాలకు తేవడంతో తేమశాతం అధికంగా ఉంటుంది. దీనికి తోడు గడ్డి, తాలు ఉంటుందని ఆరబోసుకుని గడ్డి శుభ్రం చేసి ధాన్యం తెస్తే ప్రభుత్వ ధర క్వింటాకు రూ.2,320తో పాటు బోనస్ రూ.500అదనంగా ఇస్తామని అధికారులు చెబుతున్నారు. రైతులు మాత్రం ఉన్న ధాన్యం నష్టపోకుండా ప్రైవేటులో వ్యాపారులకు అదే ధరకు విక్రయిస్తున్నారు. ఖమ్మం జిల్లాలో ప్రస్తుతం 323 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా 4.20లక్షల మె.ట ధాన్యం సేకరించాలని లక్ష్యం పెట్టుకున్నారు. ఇందులో 3.80 లక్షల మె.ట సన్నరకం, 40వేల మె.ట దొడ్డురకం ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా పౌరసరఫరాల శాఖ లక్ష్యం పెట్టుకుంది. జిల్లాలో ప్రస్తుతం సత్తుపల్లి, పాలేరు నియోజకవర్గంతో వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. మరో వారంరోజుల్లో జిల్లా అంతటా కోతలు ముమ్మరమయ్యే అవకాశం ఉంది.

ఏపీలోని మిల్లులకు జిల్లా ధాన్యం..

ఏపీలోని మండపేటనుంచి రైస్‌మిల్లర్లు సత్తుపల్లి ప్రాంతంలోకి వచ్చి స్థానిక వ్యాపారుల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. మొదట్లో 76 కేజీల బస్తాకు రూ.1,650 చెల్లించి కొనుగోలు ముమ్మరం చేశారు. ప్రస్తుతం 76 కేజీల బస్తా రూ.1,430కే కొనుగోలు చేస్తున్నారు. తక్కువ ధరకే వ్యాపారులు కొంటున్నా రైతులు వాతావరణ భయంతో మిషన్లతో వరి కోయించి ప్రైవేటు వ్యాపారులకు అమ్ముతున్నారు. తేమ శాతం 25 నుంచి 30శాతంపైగా ఉండడంతో తడిమీద ధాన్యం అమ్మితే తూకాల్లో కలిసి వస్తుందని తేమశాతం తగ్గేవరకు ఉంటే నష్టపోతామన్న ఆలోచనతో రైతులు ప్రైవేటు వ్యాపారులకు అమ్ముతుండడంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రావడం లేదు. ప్రస్తుతం తేమ ఉన్న ధాన్యం చేలోనుంచి నేరుగా వ్యాపారుల చెంతకే చేరుతోంది. కొందరు ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెచ్చిన తర్వాత కూడా తేమ అధికంగా ఉందని ఆరబెట్టమని అధికారులు చెప్పడంతో అలా కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న ధాన్యాన్ని వ్యాపారులు రైతులతో ధర మాట్లాడి బస్తాల్లో తరలించుకుపోతున్నారు. మరో పదిరోజుల్లో ముమ్మరంగా వరికోతలు జరిగితే ధాన్యం అధికంగా వచ్చే అవకాశం ఉంది. ఇటీవల కురిసిన వర్షాలు ఉదయం మంచుకారణంగా ధాన్యంలో తేమ తగ్గడం లేదు. ఎండకూడా ఉండకపోవడంతో ఆరబోసిన ధాన్యంలో తేమ శాతంలో మార్పు రావడంలేదు. కల్లాల వద్ద కాపలా ఉండడం, టార్పాల్స్‌తో వర్షానికి పంట కాపాడుకోవడం కష్టమని భావించిన రైతులు కొనుగోలు కేంద్రాల వద్దనే ప్రైవేటు వ్యాపారులతో మాట్లాడుకొని పంట అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు.



ఏపీ మిర్చికి ధరాఘాతం

- మూడు వారాల్లో రూ.3 వేలు డౌన్
- రైతుకు దక్కేది రూ.14 వేల నుంచి రూ.15 వేలు మాత్రమే
- కలిసిరాని 'కోల్డ్' నిల్వ
- ఆందోళనలో మిర్చి రైతులు

వివరాలు : 6లో



భక్తులకు కొంగుబంగారం
కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం

- 200 ఏళ్లనాటి శివాలయం
- ప్రతి ఏటా 300మంది భక్తులతో కావడి ఉత్సవం
- బురదరాఘవాపురం శివాలయం విశిష్టత

ఆలయ ప్రాశస్త్యం

ఏన్కూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏన్కూరు మండలం బురదరాఘవాపురం గ్రామంలో అతిపురాతనమైన 200ఏళ్లనాటి శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి దేవాలయం భక్తులకు కొంగు బంగారమై విరాజిల్లుతోంది. ఈ ఆలయాన్ని ఈప్రాంతం జమీందారైన కొండపల్లి కోదండ రామారావు స్వయంగా కాశీనుంచి మూడు శివలింగాలను ప్రత్యేకంగా తీసుకువచ్చారు బురదరాఘవాపురం, వైరా మండలంలోని స్నానాలలక్ష్మీపురం, ఖమ్మం గుంటిమల్లన్నస్వామి దేవాలయాల్లో ఒక్కొక్క శివలింగాలను ప్రతిష్ఠింపచేశారు. బురదరాఘవాపురం కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయానికి అనుబంధంగా ఆంజనేయస్వామి ఉపాలయం ఉంది. ఇది అతి ప్రాచీనమైనది. 2017లో ఇదే ఆలయ ప్రాంగణంలో సుబ్రహ్మణ్య స్వామి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి, ఉపాలయాలన్నిటికి నిత్య దూప, దీప నైవేద్యాలు నిర్వహించబడుతున్నాయి. ప్రతి సోమవరం కాశీవిశ్వేశ్వరస్వామికి విశేష అభిషేకాలు, ప్రతి మాస శివరాత్రికి శని త్రయోదశి సందర్భంగా రుద్రాభిషేకం నిర్వహించడం జరుగుతుంది. కార్తీకమాసంలో నిత్య రుద్రాభిషేకం జరుపబడుతుంది. ప్రతి వైశాఖ పౌర్ణమి రోజున మహాశివరాత్రి పర్వదినాన సాయంత్రం స్వామివారి వ్రతాలు, కోటి దీపోత్సవం, స్వామివారి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. సుబ్రహ్మణ్యస్వామివారికి ప్రతి మంగళవారం అభిషేకం, కల్యాణం నిర్వహిస్తారు. స్వామివారి వార్షిక ప్రతిష్ఠ రోజున సుమారు 300మంది భక్తులతో కావడి ఉత్సవం ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ. జిల్లాలోనే అత్యంత ప్రాచుర్యం కలిగిన ఉత్సవం శాంతికల్యాణం ఇక్కడే నిర్వహిస్తారు. శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి దేవాలయం విశాల ప్రాంగణంలో విరాజిల్లుతోంది. అశ్వత్థ, బిల్వశమీ అవదుంబర వృక్షాలు ఆలయ పవిత్రతను ఇనుమడింపచేస్తూ భక్తులకు మానసిక ప్రశాంతతను కలిగిస్తున్నాయి. ఆలయ ప్రాంగణంలో ప్రతిఏటా గ్రామంలోని భక్తులు సుమారు 80మంది నుంచి 100మంది అయ్యప్పమాలధారణ గావించడం దీక్షలు, భజనలు, ఇరుముడి కార్యక్రమం అత్యంత వైభవంగా జరుపుతారు. ఈ దేవాలయంలో ప్రతి సోమవారం భక్తుల గోత్రనామాలతో రుద్రాభిషేకం, అర్చన, నివేదన నిర్వహించటానికి భక్తుల నుంచి రూ.4016 టికెట్ ధర నిర్ణయించి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రస్తుత కార్తీకామస సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇంతటి మహిమ దేవాలయ నిర్వహణకు ప్రత్యేక ఆర్థిక వనరులు లేక ఇబ్బంది కలుగుతోంది. భక్తుల కానుకలు, దాతల విరాళాల ద్వారా ఆలయ నిర్వహణ కొనసాగుతుంది. ఈ ఆలయాన్ని భక్తులు సద్వినియోగించుకుని ఆలయ అభివృద్ధికి తోడ్పడాలని ఆలయ కమిటీ కోరుతోంది



ఆలయ ప్రతిష్ఠను కాపాడుతున్నాం

దెండుకూరు సీతారామచంద్రరావు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, బురదరాఘవాపురం

కోదండ రామయ్య స్థాపించిన ఆలయ ప్రతిష్ఠను కాపాడుతున్నాం. భక్తులు, దాతలు, గ్రామస్థుల సహకారంతో ఆలయాన్ని తీర్చిదిద్దుతున్నాం. ప్రతీ ఏడాది వార్షికోత్సవాలు, కోటి దీపోత్సవం, కావడి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నాం.

కొత్త ఇళ్లు వచ్చేనా..?

- గత ప్రభుత్వ హయాంలో లబ్ధిదారులుగా ఎంపికైన పలువురు
- పాత ఇళ్లను తొలగించి నిర్మాణానికి శ్రీకారం
- అంతలోనే రాష్ట్రంలో అధికారం మార్పు
- అప్పటి ప్రొసీడింగ్స్‌ను రద్దు చేసిన కాంగ్రెస్ సర్కారు
- అయోమయంలో నాటి లబ్ధిదారులు

సత్తుపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేస్తూ ప్రొసీడింగ్స్ ఇవ్వటంతో ఆనందంతో పలువురు నిరుపేదలు అప్పటి వరకూ నివాసం ఉన్న ఇళ్లను తొలగించి వాటి స్థానంలో కొత్త ఇళ్ల నిర్మాణం చేపట్టారు. కాని అంతలోనే రాష్ట్రంలో ప్రభుత్వ మార్పిడి జరగటం, తరువాత గత ప్రభుత్వ ప్రొసీడింగ్స్ రద్దు చేయటంతో లబ్ధిదారుల పరిస్థితి ఆయోమయంగా మారింది. గతంలో మంజూరు చేసిన ఇళ్లు రద్దయ్యాయని తెలియటంతో లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారు. తమ పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాలుగు వేల ఇళ్లు మంజూరు

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇళ్లు లేని నిరుపేదలకు ప్రతి నియోజకవర్గానికి మూడు వేల ఇళ్లు మంజూరయ్యాయి. సత్తుపల్లి నియోజకవర్గంలో మాత్రం నాలుగువేల ఇళ్లు మంజూరయ్యాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం మొదట్లో రూ.5 లక్షల అంచనాతో డబుల్ బెడ్ రూం ఇళ్లను నిర్మించి ఇస్తామని ప్రకటించినప్పటికీ ఆచరణ సాధ్యం కాలేదు. దీంతో గత సాధారణ ఎన్నికలకు కొద్ది నెలల ముందు ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.మూడు లక్షల చొప్పున మంజూరు చేసి లబ్ధిదారుల స్వంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునే విధంగా ప్రభుత్వం ప్రకటించింది. సత్తుపల్లి నియోజకవర్గంలో నాలుగు వేల మంది నిరుపేదలను గుర్తించి గత ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేసింది. కొందరు లబ్ధిదారులు తాము ఉంటున్న ఇళ్లను తొలగించుకొని వాటి స్థానంలో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. మరి కొందరు ఎన్నికల సమయంలో పనులు ప్రారంభించటం ఎందుకని ఆగిపోయారు.



అయోమయంలో లబ్ధిదారులు

గత ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేసిందనే ఆశతో కొందరు తాము ఉంటున్న ఇళ్లను తొలడించి స్వంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు. ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోవటంతో ఇళ్లు పూర్తి కాలేదు. దీనికి తోడు గత ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇళ్లు మంజూరు చేయటంతో బిల్లులు కూడా సకాలంలో విడుదల కాలేదు. ఎన్నికల అనంతరం రాష్ట్రంలో అధికార మార్పిడి జరగటంతో లబ్ధిదారులకు కష్టాలు ఎదురయ్యాయి.

ప్రొసీడింగ్స్ రద్దుతో ఇబ్బందులు

ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు, లబ్ధిదారుల ఎంపిక, ఇళ్ల నిర్మాణం ప్రక్రియలో భాగంగా గ్రామాల్లో ఇప్పటికే ఇందిరమ్మ కమిటీలను నియమించింది. గత ప్రభుత్వం ఇచ్చిన లబ్ధిదారుల ప్రొసీడింగ్స్‌ను కూడా రద్దు చేసింది. దీంతో ఇప్పటికే ఇళ్ల నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్న ఇళ్లను కూడా తొలగించి చేపట్టిన ఇళ్ల నిర్మాణం పూర్తి కాకపోవటం, బిల్లులు కూడా మంజూరు కాకపోవటంతో తాము అన్ని విధాలుగా నష్టపోతున్నామని వాపోతున్నారు. రాజకీయాలతో తమకు సంబంధం లేదని, తమను కూడా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాలో చేర్చి తమను ఆదుకోవాలని నిర్మాణ దశలో ఉన్న లబ్ధిదారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గత ప్రభుత్వం నాలుగు వేల మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేయగా సత్తుపల్లి నియోకవర్గంలోని సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ మండలాల్లో 400కు పైగా లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేపట్టి ఇబ్బందుల్లో పడ్డారు.

కలెక్టర్ దృష్టికి...

గత ప్రభుత్వం మంజూరు చేసి ఇళ్ల లబ్ధిదారులకు న్యాయం చేయాలని బీఆర్ఎస్ నేతలు మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, ఎమ్మెల్సీ తాతా మధుల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌ను కలసి విన్నవించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితిని ఫోటోలతో సహా కలెక్టర్‌కు అందజేసారు. నియోజకవర్గంలోని అయిదు మండలాల బీఆర్ఎస్ అధ్యక్షులు, మాజీ జడ్పీటీసీ సభ్యులు, మాజీ ఎంపీపీలు, ఇతర నాయకులు కలెక్టర్‌కు సమస్యను వివరించారు. నియోజకవర్గంలో నాలుగు వందలకు పైగా లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకుంటున్నారని ఆర్థిక ఇబ్బందులతో వారు సతమతమవుతున్నారని, ప్రస్తుతం వారికి ఇళ్లు కూడా లేవని ఇళ్లనిర్మాణం చేపట్టిన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు.

సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌కు నిధుల మంజూరు పట్ల హర్షం

అశ్వారావుపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సహజ, సేంద్రియ వ్యవసాయనికి సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్(సీవోఈ) ఏర్పాటు కోసం రూ.10కోట్లు మంజూరి చేయడం పట్ల కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ఆయిల్‌పామ్ రైతు సంఘం అడ్వయిజరీ కమిటీ సభ్యులు ఆలపాటి రామచంద్ర ప్రసాద్, బండిభాస్కరరావు, కేవీ సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలసి వెళ్లి కేంద్ర వ్యవసాయ శాఖమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కలసి సీవోఈ కోసం విజ్ఞప్తి చేయడం జరిగిందని, తుమ్మల నాగేశ్వరరావు పట్టుదలతో ఈ సెంటర్‌ను జిల్లాలో ఏర్పాటు చేసేలా కృషి చేసారని, ఈ సెంటర్‌వల్ల రైతులకు భవిష్యత్‌లో ఎంతో మేలు జరుగుతుందని ఆనందం వ్యక్తం చేసారు. రాష్ట్ర ప్రభుత్వంతో కలసి ఎంఐడీహెచ్ పథకంలో బాగంగా ఏర్పాటు చేసే ఈ సెంటర్ ద్వారా ఉద్యాన పంటల రైతులకు శిక్షణ, సహకారం అందుతుందన్నారు. వ్యవసాయం, ఉద్యాన పంటల రైతులకు ప్రయోజనం చేకూరేలా మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు రైతులందరి తరుపున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వారు పేర్కొన్నారు.



మంత్రి తుమ్మలతో కలసి కేంద్ర వ్యవసాయ శాఖమంత్రిని కలిసిన నాయకులు (ఫైల్)

డీఎస్సీ-08 అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రశాంతం

ఖమ్మం ఖానాపురంహవేలి నవంబరు 6(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ 2008 అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన బుధవారం నగరంలోని డైట్ కళాశాలలో ప్రశాంతంగా నిర్వహించామని జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ తెలిపారు. మొత్తం ఏజెన్సీ అభ్యర్థులు 265 మందికి గతంలో 18 మంది హాజరుకాగా, బుధవారం 14మంది హాజరైనట్లు డీఈవో తెలిపారు. మైదాన ప్రాంత అభ్యర్థులు మొత్తం 128 కాగా గతంలో 54 మంది హాజరుకాగా బుధవారం 67మంది హాజరైనట్లు తెలిపారు. మిగిలిన అభ్యర్థులు గురువారం హాజరు కానున్నట్లు తెలిసింది.

పారిశుధ్య నిర్వహణ నిత్యం జరగాలి

- జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత



తల్లాడ హైస్కూల్లో విద్యార్థినులతో కలిసి మధ్యాహ్నభోజనం చేస్తున్న డీపీవో

తల్లాడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిత్యం పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరిగేలా చూడాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత ఆదేశించారు. బుధవారం తల్లాడ, మల్లవరం గ్రామాల్లో ఆమె పర్యటించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తల్లాడలోని జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాలల్లో మౌళిక సౌకర్యాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్నభోజనం చేశారు. మల్లవరం గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. గ్రామంలోని వీధులను, తడి, పొడ చెత్త షెడ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామపంచాయతీ అభివృద్ధి, పారిశుధ్య పనుల గురించి పంచాయతీ కార్యదర్శులు అన్నివేళలా అందుబాటులో ఉండి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇంటిపన్నుల వసూళ్లను మరింత ముమ్మరం చేయాలని ఆదేశించారు. ఎంపీవో కొండపల్లి శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శులు ఎస్.కృష్ణారావు, షేక్.సిద్దిక్‌మియా పాల్గొన్నారు.

ప్రజలు నిర్భయంగా
సర్వేలో పాల్గొనాలి

- జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహించే సమగ్ర ఇంటింటి సర్వేలో ప్రజలు నిర్భయంగా ఎటువంటి అనుమానాలు లేకుండా పాల్గొనాలని ఆధాయ, కుల, ఇతర ధృవీకరణ పత్రాలను సర్వే అధికారులు తీసుకోరని ఎవ్వరైన ఇస్తే వాటిని తీసుకొని నమోదు చేస్తారని జిల్లా అదనపు కలెక్టర్, ఖమ్మం నగర పాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ శ్రీజ పేర్కొన్నారు. బుధవారం కేఎంసీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమే మాట్లాడారు. 2011 జనాబా లెక్కల మేరకు సమగ్ర సర్వేకు కార్యచరణ చేశామని కానీ నివాసాల సంఖ్య గణనీయంగా పెరిగి 1,45,000 నివాసాలకు పెరిగాయన్నారు. ఇందు కోసం 965 ఎన్యూమరేటరీ బ్లాక్‌లను ఏర్పాటు చేశామని, అయితే ప్రతి ఇంటికి స్టిక్కరింగ్ చేయటం ద్వారా ఇంకా నివాసాల సంఖ్య పెరుగుతాయని పెరిగిన నివాసాలకు తగిన విదంగా ఎన్యూమరేటరీ బ్లాక్‌లు పెంచుతామన్నారు.

సర్వేలో బిల్ కలెక్టర్లు, జవాన్లు, పారిశుధ్య సూపర్‌వైజర్లు సర్వే బృందాలకు ప్రాంతాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. వలసవచ్చిన ప్రజల వివరాలను నమోదు చేస్తారని ప్రకటించారు. సర్వే బృందాలకు కలెక్టర్ కార్యాలయం నుంచి ప్రతి ఉద్యోగికి గుర్తింపు కార్డును ఇవ్వటం జరుగుతుందని సర్వే బృందాలపై ప్రజలు అనుమానం చెందొద్దని వివరించారు. సర్వే సమయంలో ఏ నివాసంలో నైనా కుటుంబ సభ్యులు లేకుంటే ఆ నివాసాన్ని ప్రత్యేకంగా గుర్తించి మరోసారి సర్వే చేస్తామన్నారు.

ఇంటి నెంబర్లు లేకున్న సర్వే చేస్తారని తెలిపారు. సర్వే పూర్తి జరిగిన నివాసాలకు సంబందిత అధికారి ధృవీకరణ చేస్తున్నామన్నారు. రెండు రోజుల్లో ఇంటింటి స్టిక్కరింగ్ కార్యక్రమం పూర్తి జరుగుతుందని వివరించారు. 9 నుంచి రెండో విడత సర్వే ప్రారంబం జరుగుతుందన్నారు. సర్వేపై ఎటువంటి అనుమానాలు ఉన్న 1077 నెంబర్‌కు కాల్ చేయాలని కోరారు. సర్వేకు కావాల్సిన ఉద్యోగులు, సౌకర్యాలను క్షేత్రస్థాయికి పంపిణీ జరిగిందన్నారు. అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షఫి ఉల్లా, ఆర్వో శ్రీనివాసరావు, మేనేజరు విజయానంద్ పాల్గొన్నారు.

విస్తరణే లక్ష్యంగా
వందేళ్ల సంబురం

(5వ పేజీ తరువాయి)

పాలకుల తీరు, ఆర్థిక అంతరాలు కమ్యూనిస్టుల అవసరాన్ని గుర్తుచేస్తున్నాయన్నారు. ప్రజలు సైతం కమ్యూనిస్టుల అవసరాన్ని కోరుకుంటున్నారని, వారి అవసరాలకు అనుగుణంగా పార్టీని విస్తరిస్తూ బలోపేతం చేస్తామన్నారు. గ్రామగ్రామాన ఉద్యమచరిత్రను వివరించేందుకు ప్రణాళికను రూపొందించినట్లు కూనంనేని పేర్కొన్నారు. వందేళ్ల సంబురసభ నల్లగొండలో వచ్చేనెల 30న నిర్వహిస్తున్నామన్నారు.

మతం, అధికారం, కార్పొరేట్ సంపద కలిసి దేశాన్ని పాలిస్తున్నాయని. బీజేపీ పాలనలో మంచి జరగకపోగా అనేక ప్రజావ్యతిరేక విధానాలు చోటు చేసుకున్నాయని, ఆర్థిక అంతరాలు పెరగడంతో భవిష్యత్‌లో అరాచకానికి దారితీస్తుందని హెచ్చరించారు. రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగడం లేదని, ప్రజలకు ఉపయోగపడే విధంగా ప్రభుత్వ విధానాలు ఉండాలని మిత్రపక్షంగా సూచిస్తున్నామన్నారు.

ఈ కౌన్సిల్ సమావేశంలో సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు వందేళ్ల సంబురాల కార్యక్రమాలను వివరించగా, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ జిల్లాలో జరిగిన పార్టీ కార్యక్రమాల నివేదికను ప్రవేశపెట్టారు. సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహమ్మద్ మౌలానా, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

ఏసీ మిర్చికి ధరాఘాతం

- ఆందోళనలో మిర్చి రైతులు

ఖమ్మం మార్కెట్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో తేజరకం మిర్చి ధరలు రోజురోజుకూ పడిపోతున్నాయి. మార్కెట్‌లో బుధవారం క్వింటాలు ఏసీ మిర్చిని రూ. 18వేల జెండాపాట ధర నిర్ణయించగా, వ్యాపారులు నాణ్యతను బట్టి క్వింటాలు రూ. 9వేల నుంచి రూ. 15వేల వరకు ఎక్కువ లాట్లను కొనుగోలు చేశారు. మార్కెట్‌లో రెండు, మూడు నెలల క్రితం వరకు క్వింటాలు రూ.20 వేలు స్థిరంగా పలికిన మిర్చి ధర ఆ తర్వాత రోజు రోజుకూ తగ్గుతూ వస్తున్నది. గత మూడు వారాల వ్యవధిలోనే క్వింటాలుకు రూ. 3వేలకు పైగా తగ్గింది. ఇదిలా ఉండగా తేజరకం ఏసీ మిర్చికి చైనా, సింగపూర్, మలేషియా, థాయిలాండ్, శ్రీలంక, బంగ్లాదేశ్ తదితర దేశాలకు ఎగుమతులు నిలిచి పోవడంతో ధరలు తగ్గుముఖం పడుతున్నాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. అంతేకాకుండా ప్రస్తుతం మార్కెట్‌కు గత ఖరీఫ్ సీజన్ (వానాకాలం) సాధారణ(నాన్ ఏసీ)రకం తేజరకం మిరప పంట సైతం కొద్ది మొత్తంలో అమ్మకానికి వస్తున్నది. ఆయా రకాలను సైతం వ్యాపారులు నాణ్యతను బట్టి క్వింటాలు రూ. 6,500 నుంచి రూ. 15వేల వరకు కొనుగోలు చేస్తున్నారు.

రైతుల ఆశలు ఆవిరి

రోజు రోజుకూ తగ్గుతున్న మిర్చి ధరలతో కోల్డ్ స్టోరేజీలలో పంట నిల్వ ఉంచిన రైతుల ఆశలు అడియాశలు అయ్యాయి. మూడు సంవత్సరాల క్రితం కరోనా సమయంలో క్వింటాలు రూ. 25,500 వరకు రికార్డు ధరలు పలికిన మిర్చి ధరలు ఆ తరువాత నెమ్మదించాయి. 2022లో ఏవరేజ్‌గా క్వింటాలు మిర్చి రూ. 22వేలు, 2023లో రూ. 20వేలు పలికిన మిర్చి ప్రస్తుతం 15వేల నుంచి రూ. 18వేలు మాత్రమే పలుకుతోంది. దీంతో శీతల గిడ్డంగులలో నిల్వ ఉంచిన రైతులతో పాటు కొంత మంది మిర్చి వ్యాపారుల ఆశలు అడియాశలయ్యాయి. మిర్చి ధరల తగ్గుదలకు కారణం ముఖ్యంగా విదేశాల నుంచి ఆర్డర్లు రావట్లేదని దీంతో ధరలు తగ్గుతున్నాయని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నారు. అంతేకాకుండా ఖమ్మం పరిసరాల్లో పండించే మిర్చికి గతంలో కన్నా డిమాండ్ తగ్గిందని వ్యాపారులు చెబుతున్నారు. పంటలో వైరస్, తెగుళ్ళ ప్రభావంతో మిర్చిలో నాణ్యత తగ్గడంతో పాటు మిర్చిలో ఆయిల్ రావడం తగ్గి కొంత అంతర్జాతీయంగా డిమాండ్ సన్నగిల్లిందని వ్యాపారులు పేర్కొంటున్నారు.



కొత్త మిర్చికి పూజలు నిర్వహిస్తున్న వ్యాపారులు

మార్కెట్‌కు కొత్తమిర్చి

నగరంలోని వ్యవసాయ మార్కెట్‌కు బుధవారం వానాకాలం(ఖరీఫ్) సీజన్ తేజారకం కొత్త మిర్చి అమ్మకానికి వచ్చింది. కూసుమంచి మండలం గుర్వాయిగూడెం గ్రామానికి చెందిన నారాయణరెడ్డి అనే రైతు తన వ్యవసాయ క్షేత్రంలో పండించిన రెండు బస్తాల తేజా మిర్చిని అమ్మకానికి తీసుకొచ్చాడు. దీంతో వ్యాపారులు కార్తీకమాసం పంచమి తిథి కావడంతో కొత్త మిర్చికి పూజలు నిర్వహించి కాంటాలు నిర్వహించారు. కాగా కొత్త మిర్చిని క్వింటాలు రూ. 16,299కి వ్యాపారులు కొనుగోలు చేశారు. మిర్చి కొనుగోళ్లను మార్కెట్ సెక్రెటరీ ప్రవీణ్‌రెడ్డి, అసిస్టెంట్ సెక్రెటరీ వీరాంజనేయులు పలువురు మార్కెట్ సిబ్బంది సమీక్షించారు.

మిరపలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

- పంట మార్పిడి లేకనే తెగుళ్లు
- ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి ఎంవీ మధుసూదన్

ఖమ్మం వ్యవసాయం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలో ప్రస్తుతం 57,720 ఎకరాల్లో మిరప సాగు సాగులో ఉంది. ఖమ్మం జిల్లాలలో మిర్చి పంట యేటా పంట మార్పిడి చేయకుండా అదే భూమిలో వరుసగా సాగు చేయడం ద్వారా రకరకాల బాక్టీరియా, శిలీంద్రాల ద్వారా తెగుళ్ల వ్యాపిస్తున్నాయి. ముఖ్యంగా కాయ కుళ్లు, ఎండు తెగులు , కొమ్మ కుళ్లు తెగులు ఆశించే అవకాశం ఉంది. వాటి నివారణకు రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి ఎంవీ మధుసూదన్ తెలిపారు.

కొమ్మ ఎండు తెగులు..

తెగులు మొదట లేత కొమ్మలు, పూతను ఆశించటం వలన పూత రాలిపోతుంది. కొమ్మలు చివర్ల నుండి కిందికి ఎండుతాయి. పండు కాయల మీద కూడా నల్లటి మచ్చలు ఏర్పడి కుళ్లి రాలిపోతాయి. తాలు కాయలుగా మారతాయి. దీనిని నివారించడానికి లీటర్ నీటికి 1.5 కాప్టాన్ లేదా 2.5 గ్రాముల మంకోజెబ్ లేదా 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 1 మిల్లీ లీటర్ల ప్రోఫికోనజల్ లేదా 0.5 డైఫన్ కోనజల్ లేదా 1 గ్రాము అజాక్స్ ట్రోబిన్ లేదా 1 గ్రాము ప్లాంటోమైసిన్ కలిపి పది రోజుల వ్యవధిలో రెండు - మూడు సార్లు పూర్తిగా తడిచేల పిచికారి చేయాలి.



మిర్చి తోటను పరిశీలిస్తున్న అధికారులు

ఎండు తెగులు..

భూమిలో ఉండే శిలీంద్రం ద్వారా ఆశించి మొక్కలు ఎండిపోతాయి. దీని నివారణకు పంట మార్పిడి విధానం పాటించాలి. వేసవి కాలంలో లోతుదుక్కులు చేసుకోవాలి. తెగులు వ్యాప్తిని అరికట్టడానికి కాలువల ద్వారా నీరు పెట్టడం తగ్గించి డ్రిప్ పద్ధతిలో నీరు అందించడం అవలంబించాలి. దీనిని నివారించడానికి లీటర్ నీటికి మూడు గ్రాముల చొప్పున కాపర్ ఆక్సీ క్లోరైడ్ కలిపి మొక్కల మొదళ్లలో పోయాలి. మొదట్లో పోసిన నాలుగు తర్వాత నీరు కట్టాలి. ఎకరానికి రెండు కిలోల ట్రైకోడెర్మాను ఫార్ములేషన్‌ను 90 కిలోల పశువుల ఎరువును, 10 కిలోల వేప పిండి మిశ్రమాన్ని కలిపి వేయాలి.

మద్యం సరఫరాకు బ్రేక్

(5వ పేజీ తరువాయి)

కారణాలతో మద్యం సరఫరా బంద్ అయింది. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో ఎన్‌డీఏ ఆధ్వర్యంలోని ప్రభుత్వం మద్యం టెండర్లను నిర్వహించింది. ప్రైవేటు వ్యాపారులకు మద్యం విక్రమాలు అప్పగించింది. అయితే నూటికి 80శాతం మంది ప్రజలు తాగే మద్యంపై రేట్లను గణనీయంగా తగించింది. అయితే మధ్య ఎగువ రకాల మద్యం ధరలు తెలంగాణ కంటే ఏపీలోనే కొంత అధికంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే ఏపీలోని ఈ ధరలకు సమాంతరంగా తెలంగాణలో కూడా మద్యం ధరలను పెంచే ఆలోచనలో ప్రభుత్వం సాంకేతిక సమస్యల కారణంతో మద్యం సరఫరాను నిలిపివేసిందనే చర్చ నడుస్తోంది.

యువతి అదృశ్యం

బూర్గంపాడు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): యువతి అదృశ్యంపై బుధవారం బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. బూర్గంపాడు మండల పరిధిలోని టేకులచెరువు గ్రామానికి చెందిన నాగమణి(22) అనే యువతి టైలరింగ్ చేసుకుంటూ ఇంటి వద్దనే ఉంటోంది. ఈనెల 3వ తేదీన సాయంత్రం దుస్తులు కొనుగోలు చేసేందుకు లక్ష్మీపురం గ్రామానికి వెళుతున్నట్లు చెప్పి ఇంటి నుంచి బయలుదేరింది. అప్పటి నుంచి తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు బంధువుల దగ్గర ఆరా తీసిన జాడ తెలియరాలేదు.

యువతి తల్లి మంగమ్మ ఫిర్యాదు మేరకు బుధవారం ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

అనుమానాస్పదంగా మేకల మృత్యువాత

- కలుషిత నీరే కారణమని గ్రామస్థుల ఆందోళన

టేకులపల్లి, నవంబరు 6: అనుమానస్పద స్థితిలో 16మేకలు మృతి చెందిన ఘటన మండలంలో బుధవారం చోటుచేసుకొంది. మండలంలోని లచ్చగూడెం గ్రామానికి చెందిన రైతు జబ్బా వెంకటేశ్వర్లుకు సంబంధించిన 30మేకలను మేతకోసం కాపరి సమీపంలోని కేవోసీ ప్రాంతానికి తీసుకెళ్లాడు. అక్కడ మేతమేస్తున్న క్రమంలో మధ్యాహ్నం 30మేకల్లో 16మేకలు అపస్మారక స్థితికి వెళ్లి కాసేపటికి మృతి చెందాయి. కేవోసీలో నుంచి వస్తున్న కలుషిత నీరు తాగడం వల్లనే మేకలు మృతి చెందాయని రైతుకు మద్దతుగా గ్రామస్థులు కేవోసీలో ఆందోళన నిర్వహించారు. మిగతా మేకలూ అస్వస్థతకు గురయ్యాయని, న్యాయం చేయాలని రైతు జబ్బా వెంకటేశ్వర్లు కోరుతున్నాడు.


డిష్యుం.. డిష్యుం..

- ఎటూ తేలని భూముల పంచాయితీ
- జమలాపురం టూరిజం అభివృద్ధికి అడ్డంకులు
- ప్రతిపాదిత స్థలం తమదే అంటున్న అటవీ, రెవెన్యూ శాఖలు
- అర్బన్ పార్కు స్థలం కోసం వీడని చిక్కుముడి

ఎర్రుపాలెం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం ఉన్న జమలాపురం గ్రామంలో పర్యాటకానికి అడ్డంకులు ఎదురవుతున్నాయి. టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేసేందుకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పట్టుదలతో ఉన్నా.. భూసేకరణ సమస్యగా మారింది. గతంలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వంలో డిప్యూటీ స్పీకర్‌గా ఉన్నప్పుడు జమలాపురం చెరువును పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు బాటలు వేశారు. మినీ పార్కును సైతం ఏర్పాటు చేశారు. అయితే బీఆర్ఎస్ పదేళ్ల కాలంలో దాని అభివృద్ధిని విస్మరించారు. తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జమలాపురం పర్యాటక అభివృద్ధి తెరమీదకు వచ్చింది.

భట్టి ఆదేశాలతో జమలాపురం ఆలయానికి దగ్గరగా ఉన్న అటవీ భూముల్లో టూరిజం డెవలప్‌మెంట్, అర్బన్ పార్కు, ప్రభుత్వ కాటేజీలు, పర్యాటకులకు విశ్రాంతి గదులు నిర్మించాలని ప్రతిపాదనలు అటవీశాఖ సిద్ధం చేసింది. ఈమేరకు జమలాపురం అటవీ భూములను డీఎఫ్‌వో సిద్దార్థవిక్రమ్‌సింగ్ ఇటీవల పరిశీలించారు. కాగా జమలాపురం గ్రామంలో సర్వేనెం.9లో రెవెన్యూ భూములు ఉండడంతో తమవంటే తమవని అటవీశాఖ, రెవెన్యూ శాఖ అధికారుల మధ్య గతంలో వాదనలు జరిగాయి. ఇరువురు ఉన్నతాధికారుల ఉమ్మడి సర్వే నిర్వహించారు. ఇప్పటి వరకు సర్వే నివేదిక రాకపోవడంతో భూములు పంచాయితీ అలాగే ఉండిపోయింది. అయితే పర్యాటక అభివృద్ధికి రెవెన్యూ, అటవీశాఖలు ఒకే భూమిని సూచించడం గమనార్హం.


అటవీభూముల రికార్డులను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో



ప్రతిపాదించిన పర్యాటక స్థలానికి సరిహద్దులు

గుర్తించింది అటవీ భూములనే...



పర్యాటక అభివృద్ధికి అటవీశాఖ భూములనే గుర్తించాం, అక్కడ రెవెన్యూ భూములు లేవు. అర్బన్ పార్కు ప్రతిపాదించిన స్థలం మొత్తం అటవీశాఖ ఆధీనంలోనే ఉంది. ప్రస్తుతం ఉన్న అటవీభూముల సరిహద్దు కూడా తప్పుగా నిర్ణయించారు. మళ్లీ సర్వేలు నిర్వహించి పకడ్బందీగా అటవీభూములకు సరిహద్దులను నిర్ణయిస్తాం. గతంలో అన్ని చోట్ల చిత్తడిగా ఉండటంతో సరిహద్దులు సరిగ్గా నిర్ణయించలేదు. సర్వే ఆఫ్ఇండియా నివేదికల ప్రకారం ప్రతిపాదించిన భూములు అటవీశాఖ భూములే. రూ.5కోట్లతో పర్యాటక అభివృద్ధి చేసేందుకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. పర్యాటకంగా ఈ ప్రాంతం అభివృద్ధి చెందితే ఉద్యోగ, వ్యాపార ఉపాధి మెరుగుపడుతుంది.

సిద్ధార్థ విక్రమ్‌సింగ్, జిల్లా అటవీశాఖ అధికారి

సర్వేనెం. 9లో రెవెన్యూ భూములున్నాయి



జమలాపురం గ్రామంలో సర్వేనెం. 9లో రెవెన్యూ భూమి ఉంది. ఈ భూమిలో పలు రకాలకు చెందిన భూములు ఉన్నాయి. అందులో ప్రభుత్వ పట్టా భూములున్న రైతులున్నారు. ఎప్పటి నుంచో సాగులో ఉన్నారు. గతంలో 13మంది ఎస్సీ, ఎస్టీ, నిరుపేదలకు ప్రభుత్వం సీలింగ్ పట్టాలను అందించింది.

రెవెన్యూ రికార్డులలో ప్రభుత్వ భూమి ఉంది. ఎవరి రికార్డులు వారి కుంటాయి. ప్రభుత్వ భూములు, అటవీ భూములు ఎక్కడైనా పకడ్బందీగా ఉంటాయి. అటవీశాఖ గతంలో సరిహద్దుల్లో ట్రెంచ్ ఏర్పాటు చేశారు. అటవీశాఖ పునర్‌సర్వే నిర్వహించి వారి అనుమానాలను నివృత్తి చసుకోవచ్చు.

మన్నె ఉషా శారద, తహసీల్దార్ ఎర్రుపాలెం

ప్రమాదకరమైన వ్యాధుల చికిత్సకు అందుబాటులో జిల్లా ఆసుపత్రి

- సాధారణ కాన్పులకే ప్రాధాన్యం ఇవ్వాలి
- డీఎంఅండ్‌హెచ్‌వో కళావతిబాయి

కొణిజర్ల, నవంబరు(ఆంధ్రజ్యోతి): డయాబెటిక్, కేన్సర్ వంటి ప్రమాదకరమైన వ్యాధులకు చికిత్స చేయించుకోవడానికి జిల్లా ఆసుపత్రి ఉందని డీఎంహెచ్‌వో కళావతిబాయి తెలిపారు. బుధవారం ఆమె జిల్లా వ్యాధి నిరోధికశాఖ అధికారి చందుతో కలిసి కొణిజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా స్థానికంగా వచ్చిన రోగులతో మాట్లాడారు. ఆసుపత్రిలోని వసతులను, ఓపీని పరిశీలించారు. టీకాలకు సంబంధించిన ఇంజక్షన్లను పరిశీలించి, కేన్సర్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ తల్లులు పుట్టిన బిడ్డకు ఆరునెలలు పాటు తల్లిపాలే పట్టించాలని, అప్పుడే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని అన్నారు. సాధారణ కాన్పుల తల్లులు తప్పకుండా రెండు సంవత్సరాల పాటు అంగన్‌వాడీ కేంద్రాల నుంచి అందిస్తున్న ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. రక్తహీనత ఉన్న చిన్నారులను గుర్తించాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వాసుపత్రుల ద్వారా నాణ్యమైన వైద్యం అందుతుందని ప్రజలు గుర్తించాలని ఆమె అన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

కల్లూరు జలవనరుల శాఖ ఎస్ఈగా నర్సింహారావు



కల్లూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కల్లూరు జలవనరులశాఖ సర్కిల్ ఎస్ఈగా ఏవీవీఎస్ నర్సింహారావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు రాష్ట్ర నీటిపారుదలశాఖ (ఐ, అండ్ కాడ) కార్యాలయం నుంచి ఆదేశాలు అందాయి. ఇక్కడ ఎస్ఈగా పనిచేసిన ఆనంద్‌కుమార్ ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. దీంతో ఇక్కడ డిప్యూటీ ఎస్ఈగా పనిచేస్తున్న నర్సింహారావుకు పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు విడుదలవడంతో నర్సింహారావు బాధ్యతలు చేపట్టారు. సర్కిల్ కార్యాలయం పరిధిలో గల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు అందజేశారు. నీటిపారుదల రంగలో ఎంతో అనుభవం కలిగిన నర్సింహారావును ఎస్ఈగా నియమించటం హర్షించదగ పరిణామమని పలువురు రైతులు పేర్కొన్నారు.

పాల ఉత్పత్తిని పెంచేలా చర్యలు

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్


మాట్లాడుతున్న కలెక్టర్

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మధిర అసెంబ్లీ నియోజకవర్గంలో చేపడుతున్న ఇందిరా మహిళా డెయిరీలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ తో కలిసి ఇందిరా మహిళా డెయిరీ నిర్వహణ, పాల సేకరణ కేంద్రాల ఏర్పాటు, కొత్త యూనిట్‌ల ఏర్పాటు, మహిళా సంఘాల గ్రేడింగ్ తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఇందిరా మహిళా డెయిరీలో కల్పించాల్సిన సదుపాయాలపై దృష్టి సారించాలని అన్నారు. మండలంలో ఏ గ్రామాలలో పాల సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేయాలో ముందుగా నిర్ధారించాలని, పాల ఉత్పత్తి అధికంగా ఉంటూ, అందుబాటులో ప్రభుత్వ భూమి ఉన్న గ్రామాలలో పాల సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. పాల సేకరణ కేంద్రాలకు అవసరమైన కియాస్కులు ఏపీఎం ల వద్ద అందుబాటులో ఉన్నాయని, ఇక్కడ అవసరమైన మిల్క్ గ్రేడర్, సెగ్రిగేటర్, క్యాన్ లు, రిఫ్రాక్టోమీటర్ మొదలగు పరికరాలను ఏపీఎం సేకరించి పాల సేకరణ కేంద్రంలో ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీవో సన్యాసయ్య, మండల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

ఆళ్వార్ల వైభవంపై జాతీయ స్థాయి ప్రవచనాలు

- పలు రాష్ట్రాల నుంచి హాజరవుతున్న వేద పండితులు


మాట్లాడుతున్న శ్రీవైష్ణవ జిల్లా నాయకులు

ఖమ్మం సాంస్కృతికం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంలోని ఎన్నెస్పీ క్యాంపు రామాలయంలో ఈనెల 8వ తేదీ నుంచి 10వతేదీ వరకు మూడు రోజుల పాటు జాతీయ స్థాయి ఆధ్యాత్మిక కార్యక్రమం కొనసాగనుంది. శ్రీవైష్ణవ సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈకార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ద్వాదశ సూరిగా పిలిచే ఈ కార్యక్రమంలో ఆళ్వార్ల వైభవంపై వేద పండితులు ప్రవచనాలు బోధించనున్నారు. ఉదయం, సాయంత్రం రెండు విడతలుగా సాగే ఈకార్యక్రమంలో 12 మంది ఆళ్వార్ల వేద, భక్తి ఘనతలపై 12 మంది ఉద్దండ పండితులు ప్రవచించనున్నారు. వీరంతా బెంగళూరు, విజయవాడ, హైదరాబాద్, నరసాపురం, నెల్లూరు, విశాఖ పట్నం, తిరుపతి, తదితర ప్రాంతాలనుంచి రానున్నారు. ఈసందర్భంగా 10 తేదీ రాత్రి 7 గంటలకు సముద్రాల వెంకటరంగనాథాచార్యులు రచించిన ద్వాదశ సూరి వైభవం అనే గ్రంథాన్ని ఆవిష్కరిస్తారు.

‘విద్యుత్ లైన్లకు అనుమతులు ఇవ్వండి’


రేంజ్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న పోడు రైతులు.

చంద్రుగొండ, నంవబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టాలు ఇచ్చిన పోడు భూముల్లోకి విద్యుత్ లైన్ల ఏర్పాటుకు అటవీ అధికారులు అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బుధవారం అన్నపురెడ్డిపల్లి మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన పోడు దారులు చంద్రుగొండ రేంజ్ కార్యలయం ఎదుట ఆందోళన చేశారు. జవాది వీరభద్రం, మడివి కృష్ణ, మడివి రాజు, సున్నం శ్రీను, చీతం రామలక్ష్మీతో పాటు మరో 30 మంది చంద్రుగొండ రేంజ్ కార్యాలయంకు చేరుకొని హక్కు పత్రాలు కల్పించిన పోడు భూముల్లో వేసిన బోరు బావులకు విద్యుత్ సౌకర్యం ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలని రేంజ్ అధికారి సీహెచ్ ఎల్లయ్యను కోరారు. విద్యుత్ లైన్ల్ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వటం సాధ్యం కాదని రేంజర్ తెలపటంతో పోడు రైతులు కొంత చేపు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పోడు రైతులు విలేకరులతో మాట్లాడుతూ 90 ఎకరాలకు 37 మందికి పట్టాలు వచ్చాయని, ఆభూముల్లో ప్రభుత్వం 15 బోరు బావులు ఉన్నాయని అన్నారు. విద్యుత్ సౌకర్యం లేక బోరు బావులు, భూములు నిరుపయోగంగా ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం సోలార్ పంపు సెట్లు ఏర్పాటు చేసుకోవాలని, విద్యుత్ లైన్లకు అనుమతులు లేవని రేంజ్ అధికారి వివరణ ఇచ్చారు.

జాతీయ ఆర్చరీ పోటీలకు ఖమ్మం క్రీడాకారులు


క్రీడాకారులను అభినందిస్తున్న డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి

ఖమ్మం స్పోర్ట్స్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఈనెల 19 నుంచి 21 వరకు గుజరాత్ రాష్ట్రంలోని నడియాడ్‌లో జరగనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు నగరంలోని ఖేలో ఇండియా ఆర్చరీ సెంటర్‌లో తర్ఫీదు పొందే క్రీడాకారులు వెంకటయోగేశ్వర్, హాస్నా ఎంపికయ్యారు. ఇటీవల నెల్లికుదురులో జరిగిన 68వ ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలలో ప్రతిభ చూపి స్వర్ణ, రజత పతకాలు సాధించి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జాతీయ ఆర్చరీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను డీవైఎస్‌వో సునిల్ రెడ్డి, కోచ్ నగేష్ తదితరులు అభినందించారు. జాతీయ పోటీలలో రాణించి జిల్లాకు ఖ్యాతిని తీసుకురావాలని ఆకాంక్షించారు.

ప్రజలు ఇచ్చిన సమాచారం మాత్రమే నమోదు చేయాలి

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్


అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్

ముదిగొండ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ప్రజలు ఇచ్చిన సమాచారం మాత్రమే నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. బుధవారం ముదిగొండలో ఆయన పర్యటించారు. అనంతరం శిథిలావస్థలో ఉన్న గ్రంథాలయాన్ని పరిశీలించారు. గ్రామంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. ఖమ్మం-కోదాడ ప్రధాన రహదారిపై గుంతలు ఎక్కువగా ఉన్నాయని వాటికి మరమ్మతులు చేపట్టాలని కోరారు. ముందుగా గ్రంథాలయంలో పుస్తకాలను కలెక్టర్ పరిశీలించారు. ముదిగొండలోని ఇందిరా మహిళా డైరీ స్లిలింగ్ యూనిట్ ఏర్పాటుకు సంబంధించిన స్థలాన్ని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పరిశీలించారు. స్థలాన్ని వెంటనే స్వాధీం చేసుకొని ప్రహరీగోడను నిర్మించాలని ఆదేశించారు. ముదిగొండ మండల పూరిధిలో ఐదు పాల సేకరణ కేంద్రాలు ఏర్పాటుచేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో సన్యాసయ్య, డీపీడబ్ల్యూవో విజయలక్ష్మి, తహసీల్దార్ సునీలా ఎల్జిబెత్, ఎంపీడీవో శ్రీధర్‌స్వామి, లైబ్రేరియన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

డయల్ 100కు 4,481 కాల్స్

ఖమ్మంక్రైం, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): సమాజంలో పెరుగుతున్న నేరప్రవృత్తి నేపథ్యంలో ప్రజల ధన, మాన రక్షణే ధ్యేయంగా ఏర్పాటైన డయల్ 100కు అక్టోబరు నెలలో 4481 కాల్స్ వచ్చాయని సీపీ సునీల్‌దత్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విచారణ జరిపి 74 ఎఫ్‌ఐఆర్‌లు నమోదుచేశామని, వీటిలో మహిళలపై వేధింపులు 1, దొంగతనాలు 4, సాధారణ ఘాతాలు 24, యాక్సిడెంట్లు 12, అనుమానస్పదమరణాలు 10, ఇతర కేసులు 23 అని తెలిపారు.

‘కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు తలెత్తవద్దు’

దమ్మపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ అధికారులను ఆదేశించారు. నాచారం, గండుగులపల్లి, దమ్మపేటలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను వేణుగోపాల్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎంతో కష్టపడి ధాన్యాన్ని పండిస్తున్నారని, వారిని ఇబ్బందులకు గురి చేయవద్దన్నారు. రైతులకు అవసరమైన టార్పాలిన్‌పట్టాలు, తూర్పారా పట్టే యంత్రాలను అందుబాటులో ఉంచాలని అన్నారు. గన్నీబ్యాగ్స్ కొరత లేకుండా చూడాలన్నారు. ధాన్యం ఎక్కువగా వచ్చే కేంద్రాలలో రవాణా చేసేందుకు లారీలను అందుబాటు వుంచాలని అందుకు ప్రణాళికా బద్ధంగా కృషి చేయాలన్నారు. కొనుగోనులు కేంద్రవద్ద ఆరబోసిన ధాన్యాం తేమ శాతాన్ని ఆయన పరిశీలించారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. అనంతరం అల్లిపల్లి గ్రామంలో పౌరసరఫరాలశాఖా ఆద్వర్యంలో నిర్వహిస్తున్న అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. రెవెన్యూ, వ్యసాయశాఖ, పోలీసులు అధికారులు సమన్వయంలో రాష్ట్ర సరిహద్దుల ద్వారా వరి ధాన్యం అక్రమ రవాణా కాకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవన్నారు.


విజయనగరం భక్తులందజేసిన నిత్యకల్యాణమూర్తులు

భద్రాద్రి రామయ్యకు స్వర్ణ ఆభరణాలు

భద్రాచలం, నవంబరు 6: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారికి బుధవారం ఏపీలోని విజయనగరం, విజయవాడకు చెందిన భక్తులు బంగారు ఆభరణాలను అందజేశారు. విజయనగరానికి చెందిన పెంటపాటి సత్యనారాయణ మూర్తి, వెంకటరత్నశ్రీ దంపతులు నిత్యకల్యాణ మూర్తులకు రూ.3.10లక్షల విలువైన రాగిపై బంగారుపూతతో ఉన్న కవచాలను ఆలయాధికారులకు అందజేశారు. సంప్రోక్షణ నిర్వహించిన అనంతరం నిత్యకల్యాణంలో ఈ స్వర్ణ కవచాలను స్వామి వారికి ధరింపజేశారు. విజయవాడకు చెందిన ఎ.భాస్కరం కుటుంబ సభ్యులు బంగారు ముత్యాల దండ, బంగారు చైనును రూ.1.39 లక్షల విలువైనవి ఏఈవో కత్తి శ్రీనివాసరావు, ఆలయ పర్యవేక్షకుడు లింగాల సాయిబాబాకు అందజేశారు.

వరి కోతల వేళ...

- కోత, నిల్వపై రైతులకు అవగాహన అవసరం
- వరి వెన్నులు రంగు మారే సమయం సేకరణకు శ్రేయస్కరం
- తూర్పారా బట్టి శుద్ధి చేయడం ప్రధానం



ఖమ్మం వ్యవసాయం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వరి కోతలు ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్నాయి. పంట చేతికొచ్చిన సమయంలో కోతలు చేపట్టకపోతే రైతులు నష్టపోయే ఆస్కారం ఉంది. చేను పూర్తిగా ఎండినా, పండువారినా కోత సమయంలో గింజలు రాలుతాయి. పంట చేతికొచ్చినప్పటి నుంచి కోతలు, ధాన్యం నిల్వ చేయడం వంటి వాటిపై రైతులు అవగాహన పెంచుకోవాలి. వరికోతల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సూచనలు, సలహాలు ఇస్తూనే ఉన్నారు. పంట నాణ్యంగా ఉంటేనే రేటు వస్తుంది. కొన్ని నెలల పాటు ధాన్యం నిల్వ ఉంటుంది. చేను పండువారిన తరువాత కోతకు 15రోజుల ముందే నీటి తడులు నిలిపేయాలి.

గెలకున్న చివరి గింజ పాలుతాగి పసుపెక్కే వరకూ పంట కోయొద్దు. ముందే కోస్తే తాలు గింజలవుతాయి. అలాగే మంచు కురిసే సమయాల్లో కోస్తే గింజలు మెత్తబడి ధాన్యం నలుపెక్కుతుంది. ఇలా అని కోతలు ఆలస్యమైతే ఎండకు గింజ పగుళ్లు వచ్చి వడ్లు నూక అవుతాయి. 80 నుంచి 90శాతం వరి వెన్ను ల పసుపు రంగుకు మారుతున్న సమయంలో పంట కోయాలి. ఆకులు పూర్తిగా ఎండిపోయే వరకు చేనును ఉంచకూడదు. ఈ దశలో వడ్లలో సాధారణంగా 18-20శాతం తేమ ఉంటుంది. తేమ శాతాన్ని తగ్గించేందుకు రెండు మూడు రోజులు మెద ఎండపెట్టాలి. హార్వెస్టర్‌తో కోస్తే వెంటనే కల్లంలో ఆరబోయాలి.

రాత్రిళ్లు మంచు తగలకుండా కుప్పచేసి కవర్ కప్పాలి. ఒక వేళ వర్షం వస్తే 5శాతం ఉప్పు కలిపిన నీటిని చేనుపై పిచికారి చేయాలి. హార్వెస్టర్లలో దుమ్ముధూళి, మట్టిపెళ్లలు ఉండకుండా చూసుకోవాలి. కోత సమయాల్లో వేర్వేరు రకాల ధాన్యం కలవకుండా చూసుకోవాలి. కోతల తర్వాత వడ్లను తూర్పారబట్టి శుద్ధి చేయాలి. ధాన్యంలో తేమ 12 నుంచి 14 శాతం తగ్గే వరకు ఎండబోయాలి. ఇలా చేస్తే ధాన్యం ఎక్కువ రోజులు నిల్వ ఉంటుంది. నిల్వ సమయంలో అధిక తేమ లేకుండా చూసుకోవాలి. ధాన్యాన్ని ఆశించే కీటకాల నుంచి రక్షణకు పరిసరాల్లో పొగబెట్టాలి. గోనె సంచులు, గుమ్మిళ్లలో ధాన్యాన్ని నిల్వ చేయాలి. నిల్వ చేసే చోట తడి లేకుండా, బస్తాలకు చిల్లులు లేకుండా చూసుకోవాలి.

పొలంలో గింజలతో పంటలో కల్తీ

మడుల్లో ధాన్యం గింజలు పడకుండా చూసుకోవాలి. లేకుంటే వచ్చే సీజన్‌లో ఈ గింజలే మొలిచి ఇతర పంట ఉత్పత్తులు కల్తీ అవుతాయి. వరి పొలంలో కంకులు మొత్తం ఎండే వరకు ఆగాలి. దీంతో రైతులకు నాణ్యమైన ఉత్పత్తులు వస్తాయి. పొలం కోసిన తర్వాత కలుపు, ఇతర మొక్కలు ఏమైనా ఉంటే తీసివేయాలి.

ఇలా చేస్తే పంటసాగులో కలుపు నివారణ సులువవుతుంది. వరి కోతల సమయంలో రైతులు వ్యవసాయాధికారుల సూచనలు తప్పక పాటించాలి. ధాన్యం కోతలో అలాగే పొలంలో పలు జాగ్రత్తలు తీసు కుంటే తరువాత వేసే పంటలకు మేలు జరుగుతుంది. ధాన్యాన్ని ప్రభుత్వ కొనగోలు కేంద్రాలకు తరలించాలి. దళారులను ఆశ్రయించి తక్కువ ధర పొంది మోసపోవద్దు.

ఘరానా దొంగ అరెస్టు

- రిమాండ్‌కు తరలించిన టౌన్ పోలీసులు
- పాల్వంచ సీఐ వినయ్‌కుమార్


నిందితుడి వివరాలను వెల్లడిస్తున్న సీఐ వినయ్‌కుమార్

పాల్వంచ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో అనేక దొంగతనాలకు పాల్పడి తప్పించుకు తిరుగుతున్న ఘరానా దొంగను పాల్వంచ టౌన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నవభారత్ ప్రాంతంలోని జగ్గుతండా క్రాస్ రోడ్డు వద్ద టౌన్ పోలీసులు సీసీఎస్ పోలీసులతో కలిసి వాహన తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. సదరు వ్యక్తి పలు చోరీలకు పాల్పడినట్లు తేలింది. కేసుల వివరాలను పాల్వంచ సీఐ వినయ్‌కుమార్ బుధవారం పాల్వంచ సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. సీఐ కథనం ప్రకారం.. కొత్తగూడెం హౌసింగ్‌బోర్డు కాలనీ రాందాస్ తండాకు చెందిన రూప్లాల్ వ్యవసాయ కూలీగా చెప్పుకొంటూ పలు చోరీలకు పాల్పడ్డాడు. పాల్వంచ, చుంచుపల్లి, తల్లాడ, అశ్వాపురం, ములుగు పోలీస్ స్టేషన్ల పరిధిలో మహబూబాబాద్‌కు చెందిన మందా కళ్యాణి అనే మహిళతో కలిసి పలు ఇళ్లలో చోరీలకు పాల్పడ్డాడు. గతంలోనే రూప్లాల్ చోరీ కేసుల్లో పలుమార్లు జైలు జీవితం గడిపాడు. అయినా అతను తన ప్రవృత్తిని మానుకోకుండా సదరు మహిళతో కలిసి పలు ఇళ్ల తాళాలు పగులగొట్టి బంగారు, వెండి ఆభరణాలు అపహరించాడు. వీరిద్దరూ కలసి అశ్వాపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని అమ్మవారి గుడిలో హుండీ పగులగొట్టి అందులోని నగదును దొంగిలించారు.

పాల్వంచ పట్టణ పరిధిలోని ఇందిరాకాలనీలో ఓ పల్సర్ బైక్‌ను తస్కరించారు. వారం రోజుల క్రితం మందా కళ్యాణిని పాల్వంచ టౌన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుంచి కళ్యాణి తోడుదొంగ కోసం గాలిస్తున్న పోలీసులకు వాహన తనిఖీల్లో ఘరానా దొంగ పట్టుబడ్డాడు.

అతని వద్ద నుంచి ఎనిమిది తులాల బంగారు నగలు, రెండు ద్విచక్రవాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో తాను చోరీలకు ప్పాడినట్లు స్వయంగా రూప్లాల్ అంగీకరించడంతో అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పాల్వంచ సీఐ వినయ్‌కుమార్ తెలిపారు. ఈ మీడియా సమావేశంలో పాల్వంచ టౌన్ ఎస్ఐ సుమన్, సీసీఎస్ ఎస్ఐ రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి



దుమ్ముగూడెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): దుమ్ముగూడెం జాలరి వీధికి చెందిన వివాహిత కుప్పిలి రాజేశ్వరి(32) బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందింది. చేపల వ్యాపారం చేసేందుకు మారాయిగూడెం వైపు వెళ్తున్న క్రమంలో ఆర్లగూడెం ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి కల్వర్టు వద్ద ద్విచక్రవాహనంపై నుంచి జారి కింద పడడంతో తలకు తీవ్రగాయమైంది. సమీప బంధువైన ఒక యువకుడు ద్విచక్రవాహనాన్ని నడుపుతుండగా, వాహనం గోతిలో పడడంతో వెనుకగా కూర్చున్న రాజేశ్వరి అదుపు తప్పి కింద పడింది. తీవ్రగాయాలపాలైన రాజేశ్వరిని 108 వాహనంలో భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించింది. భర్త పోసి, ఇద్దరు పిల్లలున్నారు.



జిమ్నాస్టిక్స్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం స్పోర్ట్స్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలోని జిమ్నాజియం కోచింగ్ సెంటర్ నందు జిమ్నాస్టిక్స్ క్రీడాకారులకు శిక్షణ ఇచ్చేందుకు గాను ఎన్ఐఎస్ సర్టిఫికెట్ ఉన్న వారు లేదా సీనియర్ క్రీడాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీవైఎస్ఓ సునిల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 14 సాయంత్రం 5 గంటల కల్లా స్టేడియంలోని జిల్లా క్రీడల శాఖ కార్యాలయంలో తమ దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

కూరగాయలు ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	40రూ.
వంకాయ	58
గుత్తి వంకాయ	60
బీరకాయ	44
పచ్చిమిర్చి	44
కాకరకాయ	38
బెండకాయ	38
పొట్లకాయ	48
దోసకాయ	48-68
గోరుచిక్కుడు	68
క్యాబేజీ	38
దొండ	24-34
సొరకాయ	28
క్యారెట్	84
క్యాప్సికం	98
ఆలుగడ్డ	40
ఉల్లిగడ్డ	60-70
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	170
కొత్తిమీర కట్ట	40

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

నగరంలో 9వేల నివాసాలకు సర్వే స్టిక్కర్లు

క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



44వ డివిజన్‌లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ విజయవెంకటరమణ

ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సమగ్ర ఇంటింటి సర్వేకు తొలి రోజు ఖమ్మం నగర పాలక సంస్థలో ఎన్యూమరేటర్లు, కార్పొరేటర్లు, ఇతర అధికారులు సమన్వయంతో పనిచేసి మంచి ఫలితాలను సాధించారు. ఖమ్మం నగరంలోని 60 డివిజన్లలో మధ్యాహ్నం నుంచి సర్వే పనులు ప్రారంభం జరిగాయి. సాయంత్రం వరకు 9వేలకు పైగా నివాసాలకు ఇంటింటి సమగ్ర సర్వేపై స్టిక్కర్లు అంటించారు. వీడియోస్ కాలనీలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ క్షేత్రస్థాయి పర్యటన చేసి ఇంటింటి సర్వేను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సర్వే బృందాలకు పలు సూచనలు చేశారు. 44వ డివిజన్‌లో కార్పొరేటర్ పాలేపు విజయవెంకటరమణ ఎన్యూమరేటర్ బృందాలతో కలిసి స్టిక్కర్లు అంటించి స్థానికులకు అవగాహన కల్పించారు. తొలి రోజు ఇంటింటి సర్వే విజయవంతం కావటంతో మరో రెండు రోజుల్లో నగరంలో తొలి విడతలోనే ఇంటింటికి స్టిక్కర్లు అంటించి ఇంటి యజమానుల పేర్లు నమోదుకు వేగంగా కార్యచరణ చేశారు. ఈ మేరకు ప్రత్యేక అధికారులతో ఇన్‌చార్జ్ కమిషనర్ శ్రీజ ఫోన్‌లో మాట్లాడి పలు లోపాలను సవరించారు.

అధికారుల తాత్సారం

- నగరంలో అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులకు స్పందన కరువు
- కావాలనే కాలయాపన...
- యేడాది క్రితం ఫిర్యాదులు పెండింగ్‌లోనే

ఖమ్మం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): యేడాది క్రితం.. ఖమ్మం రెవెన్యూ పరిధిలోని శ్రీనివాస నగర్ ప్రాంతంలో ఉన్న సర్వే నెంబరు 344కు సంబంధించి వివాదం ఏర్పడింది. కొందరు ఆక్రమణదారులు కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నారంటూ ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు అందింది. సర్వే నెంబరు 339,340 డాక్యుమెంట్ల పేరుతో అపార్ట్‌మెంట్ నిర్మాణానికి అనుమతులు తీసుకుని 344లో సర్వే నెంబరులో అక్రమంగా నిర్మాణం చేస్తున్నారని, సదరు నిర్మాణానికి సంబంధించి ఎలాంటి పత్రాలు లేవనేది ఫిర్యాదులో సారాంశం.

నిర్మాణం ప్రారంభ సమయంలోనే ఫిర్యాదు అందగా.. ఖమ్మం కార్పొరేషన్‌లోని సంబంధిత సెక్షన్ అధికారులు దానిగురించి పట్టించుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి. దాంతో ఫిర్యాదుదారులు లోకాయుక్తాను ఆశ్రయించారు. ఫలితంగా ప్రస్తుతం జిల్లా ఉన్నతాధికారుల నుంచి మొదలుకుని, కార్పొరేషన్ ఉన్నతాధికారుల వరకు లోకాయుక్తకు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది. నేటివరకు దాని గురించి ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

గతేడాది డిసెంబరులో ఖమ్మం నగరంలో రాపర్తినగర్‌కు సమీపంలో ఓ ఫంక్షన్ హాలుకు పక్కన ఉన్న గోళ్లపాడు ఛానల్ స్థలాన్ని ఆక్రమించారంటూ కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు అందింది. ఫిర్యాదుదారుడు ఆక్రమణకు సంబంధించి సర్వే అధికారులు, ఇరిగేషన్ శాఖ వారు ఇచ్చిన రిపోర్టును సైతం జత చేశారు. కాని నేటివరకు ఫిర్యాదు పెండింగ్‌లోనే ఉండటం గమనార్హం. ఇవి రెండు అంశాలు ఉదాహరణలు మాత్రమే.. ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో అక్రమ నిర్మాణాలకు సంబంధించి సంబంధిత సెక్షన్‌లో కుప్పలు తెప్పలుగా ఫిర్యాదులు ఉన్నట్టుగా తెలుస్తోండగా.. అవి బయటకు రాకుండా సంబంధిత సెక్షన్ అధికారులు జాగ్రత్తలు పడుతున్నారు. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదుల విషయంలో తాత్సారం చేస్తున్న తీరుపై ఇటీవల కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులను ప్రశ్నించారు. పైగా గతంలో వచ్చిన ఫిర్యాదులను ఉన్నతాధికారులకు తెలియకుండా సంబంధిత అధికారులు జాగ్రత్తలు పడుతున్నట్టు తెలుస్తోంది.

ఒక్కో సంఘటనలో ఒక్కో విధంగా..

అక్రమ నిర్మాణాల విషయంలో సంబంధిత సెక్షన్ అధికారుల తీరు ఒక్కో సంఘటనలో ఒక్కో రకంగా ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయడం పరిపాటిగా మారిన సదరు సెక్షన్‌లో ఆయా నిర్మాణాలపై ఫిర్యాదులు వచ్చిన సందర్భంలో మాత్రం చట్టాన్ని పలురకాలుగా ఉపయోగిస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు. ఫిర్యాదు చేయడానికి ముందే ఎక్కడైనా అక్రమంగా నిర్మాణాలు చేపడుతుంటే వాటిని నిలిపివేయడంతోపాటు తదుపరి చర్యలకు ఉపక్రమించాల్సిన అధికారులు అక్రమాలకు తావిస్తున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. మరికొన్ని సందర్భాల్లో ఫిర్యాదులు వచ్చినప్పుడు వెనువెంటనే నోటీసులు జారీ చేయడం వెనుక ఉన్న అంతర్యమేంటనేది తెలియాల్సి ఉంది.

టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా శ్రీనివాసరావు



అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్, గురవయ్య

నేలకొండపల్లి, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులుగా మందడపు శ్రీనివాసరావు, తొర్తి గురవయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం నేలకొండపల్లిలోని యూటీఎఫ్ భవన్‌లో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఈఎన్నిక జరిగింది. ఉపాధ్యక్షుడిగా విజయ్‌కుమార్, పద్మ, ప్రధాన కార్యదర్శిగా తొర్తి గురవయ్య, కోశాధికారిగా జ్యోతి, కార్యదర్శులుగా అరుణ, కోటేశ్వరరావు, కరుణశ్రీ, చిన్నమౌలాలీ, నాగార్జునలతో పాటుగా నలుగురు కార్యవర్గ సభ్యులను, ముగ్గురు జిల్లా మహాసభ ప్రతినిధులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శి సురేష్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు రావెళ్ల అరవిందకుమార్, రాష్ట్ర బాధ్యులు రంజాన్, కోశాధికారి రాంబాబు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ కాశయ్య

నేలకొండపల్లి, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): రైతులు దళారుల బారిన పడకుండా సొసైటీలు ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని బోదులబండ సహకార సంఘం అధ్యక్షుడు అనంతు కాశయ్య రైతులను కోరారు. బుధవారం సొసైటీ పరిధిలోని రైతుల సౌకర్యం కోసం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతు లు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తెచ్చి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందాలని కోరారు. అనంతరం నేలకొండపల్లి డీసీసీబీ మేనేజరు ఇందుతో కలిసి 48మంది రైతులకు రూ.30లక్షల రుణాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కొత్తపల్లి సుబ్బయ్య, సీఈఓ ఐనంపూడి నాగేశ్వరరావు, డైరెక్టర్ మీసా నాగేశ్వరరావు, రైతులు యర్రా చలపతిరావు, సూపర్‌వైజర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డీసీఎంఎస్ ఆధ్వర్యంలో

డీసీఎంఎస్ ఆధ్వర్యంలో నేలకొండపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ వెన్నపూస లసీతారాములు ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జాదవ్ మాణిక్యరావు, డీసీఎంఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీలకు నయాబజార్ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ రామారావు

ఖమ్మం స్పోర్ట్స్ నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్- 17, 19 అథ్లెటిక్స్, వాలీబాల్, ఖో-ఖో పోటీలకు తమ కళాశాల విద్యార్థులు ఎంపికైయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ కేఎస్. రామారావు తెలిపారు. తమ కళాశాలలో ఇంటర్ చదువుతున్న విద్యార్థులు గోపీనాథ్, మనోజ్‌కుమార్, లోకేష్, వెంకటసాయి ఇటీవల నగరంలో జరిగిన ఎంపికల్లో ప్రతిభ చూపి రాష్ట్ర పోటీలకు ఎంపికైనారని వారు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఆయన అభినందించారు. రాష్ట్ర పోటీలలో రాణించి ఖమ్మం జిల్లాకు ఖ్యాతిని తీసుకు రావాలని ఆకాంక్షించారు.

సైబర్ మోసాలపట్ల అప్రమత్తంగా ఉండాలి

ఖమ్మంక్రైం, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): అపరిచితుల మోసాలపట్ల అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైం ఏసీపీ ఫణిందర్ అన్నారు. నగరంలోని రిటైర్డు గెజిటెడ్ అధికారుల సంఘం కార్యాలయంలో సీనియర్ సిటిజన్లకు బుధవారం సైబర్‌నేరాల పట్ల అవగాహన కలిపించారు. ఏసీపీ మాట్లాడుతూ పెట్టుబడులు, అధిక లాభాల ముసుగులో సైబర్‌కేటుగాళ్ల వలలో పడి మోసపోవద్దని, అపరిచిత లింక్‌లు, వెబ్‌సైట్లు, అప్లికేషన్లు, మెసేజ్‌లు లింకులు నమ్మవద్దన్నారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే 1930కు ఫిర్యాదు చేయాలని, తెలిపారు.

సభ్యత్వ నమోదు విరివిగా చేయండి..

- 11న ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ
- టీడీపీ పాలేరు ఇన్‌చార్జ్ కొండబాల



సభ్యత్వాలు అందజేస్తున్న దృశ్యం

నేలకొండపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని, పార్టీ అభిమానులు, కార్యకర్తలను పెద్ద సంఖ్యలో సభ్యులుగా చేర్చాలని టీడీపీ పాలేరు ఇన్‌ఛార్జ్ కొండబాల కరుణాకర్ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవారం నేలకొండపల్లి గోగినేని సీతారామారావు ఇంట్లో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో కొండబాల మాట్లాడుతూ జిల్లాలో ముఖ్యంగా పాలేరు నియోజకవర్గంలో ప్రజలు పెద్ద సంఖ్యలో తెలుగుదేశం వైపు మొగ్గుతున్నారన్నారు. ప్రజల్లో వచ్చిన, వస్తున్న మార్పును కార్యకర్తలు పార్టీకి అనుకూలంగా మార్చుకోవాలన్నారు. 11న మండల పరిధిలోని రామచంద్రాపురంలో టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి, ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ ఉందని, విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కొండబాల పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆరెకట్ల కొండలరావు, సూరపనేని రామకృష్ణ, తలశీల గోపాలరావు, నలమాస మల్లయ్య, అక్కినేని నాగేశ్వరరావు, మద్దినేని మహేష్, కట్టా రాజేష్, బల్లి వెంకన్న, కోలేటి మస్తాన్‌రావు, కారంగుల వీరబాబు, పావులూరి వెంకటేశ్వరరావు, నూక హనుమంతరావు, నంబూరి హరీష్, రావెళ్ల వెంకటేశ్వరరావు, తాడేపల్లి వెంకటేశ్వరరావు, గోగినేని సీతారాం బాబు, తీగ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సీపీఐ నేత మల్లయ్యకు కూనంనేని నివాళి



మాట్లాడుతున్న కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని

ఖమ్మం రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎర్రజెండా విడవకుండా తన తుది శ్వాస వరకు ఎర్రబోయిన మల్లయ్య కమ్యూనిస్టుగానే కొనసాగారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మండల పరిధిలోని కాచిరాజుగూడెంలో సీపీఐ సీనియర్ కార్యకర్త ఎర్రబోయిన మల్లయ్య దశదినకర్మలకు బుధవారం కూనంనేని హాజరైయ్యారు. మల్లయ్య చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతు అనేక పార్టీలు అధికారం కోసం పుట్టి అవిపోగానే కనుమరుగు అవుతుంటాయన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర నాయకుల మౌలానా, రాంమూర్తి నాయక్, కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలోకి బీఆర్ఎస్ నాయకులు



పార్టీలో చేరిన వారితో బీజేపీ నాయకుడు వినోదరావు

ఖమ్మంక్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 9వ డివిజన్ బీఆర్ఎస్‌కు చెందిన పలువురు నాయకులు బుధవారం బీజేపీలో చేరారు. బీజేపీ రాష్ట్ర నాయకులు తాండ్రవినోదరావు పార్టీలో చేరిన వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. వినోదరావు మాట్లాడుతు ప్రపంచంలోనే భారత్ సూపర్‌కంట్రీగా ముం దుకు వెళుతుందని, కేంద్రం చేస్తున్న అభివృద్ధి చూసి బీజేపీ లో చేరారన్నారు.ఈసందర్భంగా బీజేపీలో చేరిన షేక్ హుస్సేన్, షేక జమీల్ అహ్మద్, చందాల నరేందర్‌లను అభినందించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ కమిటీ అధ్యక్షుడు కుమిలి శ్రీనివాసరావు, అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ, నీలిమ, సీతారాములు, అంజయ్య పాల్గొన్నారు.

సీఎంని కలిసిన ఎస్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



సీఎం రేవంత్‌రెడ్డితో ఎస్టీఎఫ్ నాయకుడు సైదులు

ఖమ్మం ఖానాపురంహవేలి నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యాసంస్థలు బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నల్లో భాగంగా రాష్ట్రంలోని వివిధ శాఖ ల ఆధ్వర్యంలో నడుస్తున్న హాస్టల్ విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలను భారీగా పెంచినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌కెడ్డికి ఎస్టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ సైదులు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో సెక్రటేరియట్‌లోని మీడియా పాయింట్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

అమరవీరుల ఆశయాలు సాధించాలి

తిరుమలాయపాలెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారం కోసం అసువులబాసిన అమరుల ఆశయాలు సాధిం చాలని న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.రాజేంద్రప్రసాద్ తెలిపారు. బుధవారం మండలంలోని ఎర్రగడ్డలో అమరవీరులవారోత్సవాలలో భాగంగా సభలో ఆయన మాట్లాడుతూ అమరవీరుల ఆశయాలు సాధించినప్పుడే వారికి నిజమైన నివాళిఅన్నారు. ఈకార్యక్రమంలో జి.రమేష్, వీరస్వామి, పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



ఎస్టీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న పెన్షన్‌దారులు

నేలకొండపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆల్‌పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం నేలకొండపల్లి ఎస్టీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ఎన్నిసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళినా పరిష్కారం గావటం లేదన్నారు. పెన్షనర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని లేని పక్షంలో ఆందోళనకు దిగుతామని పెన్షనర్ల సంఘం నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో ఏటుకూరి రామారావు, వల్లంచెట్ల భాస్కరరావు, పెండ్యాల గోపాలకృష్ణమూర్తి, ఏలూరి కోదండరామారావు, దాసరి స్వామినాధం, రామయ్య, భాస్కరరెడ్డి, మంకెనపల్లి నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణ కోసమే షీ టీమ్స్: సీఐ

ఖమ్మం రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మహిళలు రక్షణకోసం షీటీమ్స్ పనిచేస్తున్నాయని సీఐ సత్యనారాయణ తెలిపారు. మండల పరిదిలోని కోదాడ క్రాస్‌రోడ్డులోని సోషల్ వెల్ఫేర్ మహిళా డిగ్రీ కాలేజిలో బుధవారం విద్యార్థినులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతు మహిళలు, యువతులు, బాలికలు ఆకతాయిల వలన వేధింపులకు గురిచేస్తే వెంటనే షీటీమ్స్‌కు సమాచారమివ్వాలని సూచించారు. 87126 59222 ఫోన్ నంబర్‌కు లేదా డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, షీటీం సభ్యులు పాల్గొన్నారు.

వేగవంతంగా జర్నలిస్టుల ఇళ్లస్థలాల పక్రియ

ఖమ్మంటౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నియోజకవర్గంలో అర్హులైన జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు దక్కే ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని నగరంలోని జడ్పీ అతిథి గృహంలో బుధవారం నిర్వహించిన స్తంభాద్రి జర్నలిస్టు హౌజింగ్ సొసైటీ, మూడు జర్నలిస్టు సంఘాల సంయుక్త సమావేశంలో నిర్ణయించారు. సొసైటీ చైర్మన్ కనకం సైదులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో టీయూడబ్ల్యూజే-ఐజేయూ జిల్లా అధ్యక్షుడు వనం వేంకటేశ్వర్లు, టీయూడబ్ల్యూజే-టీజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆదినారాయణ, టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొండలరావు హాజరయ్యారు. వీలైనంత త్వరగా అర్హులైన జర్నలిస్టులకు సభ్యత్వం ఇవ్వటం, ప్రభుత్వం కేటాయించిన స్థలానికి నగదు జమ తదితర అంశాలపై చర్చించారు.

అందరి భాగస్వామ్యంతో సమగ్ర ఇంటింటి సర్వే

- స్టిక్కరింగ్‌లో కార్పొరేటర్లు సహకరించాలి
- ఎక్కడైనా ఇబ్బందులు ఏర్పడితే కమిషనర్ దృష్టికి తీసుకరావాలి
- మేయర్ పునుకొల్లు నీరజ



మాట్లాడుతున్న మేయర్ నీరజ

ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 6 (అంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి సమగ్ర సర్వేలో కార్పొరేటర్లతో పాటుగా అందరి భాగస్వామ్యం ఉండాలని తొలి విడతలో ప్రతి ఇంటిని గుర్తించి స్టిక్కర్లు అంటించి కుటుంబ యజమాని పేరు నమోదు చేయటంలో అధికారులకు ప్రజాప్రతినిదులు సహకరించాలని ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. ఇంటింటి సమగ్ర సర్వేపై బుధవారం ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో కార్పొరేటర్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ స్థానికంగా ఉన్న నివాసాలపై కార్పొరేటర్లు, బిల్ కలెక్టర్లు, జవాన్లకు అవగాహన ఉంటుందని, సర్వే బృందాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లి దెగ్గరుండి సర్వేకు సహకరించాలని కోరారు. సర్వేలో ఎటువంటి పొరపాట్లు జరిగిన వెంటనే తనకు ఫోన్ చేసి దృష్టికి లేదా కమిషనర్‌కు సమాచారం ఇవ్వాలని కానీ ఒక్క ఇల్లు కూడా మిస్‌కాకుండా చూసుకోవాలని సూచించారు. తొలి విడతలో గుర్తింపు జరిగితే రెండో విడతలో సమగ్రంగా సర్వే పూర్తి జరుగుతుందన్నారు. మరోసారి ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వస్తాయని తెలిపారు. ఇన్‌చార్జ్ కమిషనర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ మాట్లాడుతూ ఇంటింటి సర్వే మార్గదర్శకాలను, కార్పొరేటర్ల సహకారంపై వివరించారు. ఆర్వో శ్రీనివాసరావు, మెనేజరు విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు

తిరుమలాయపాలెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): టీపీటీఎఫ్ మండల కమిటీ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా వి.వెంకటేశ్వర్లు, బి.వెంకటరాము, ఉపాధ్యక్షులుగా ఎం.ప్రశాంత్, లక్ష్మయ్య, శరత్, మల్లిఖార్జున్ వసంతరాణి, కార్యదర్శులుగా వీరబాబు, వెంకటరాజు, సంధ్య, వీరస్వామిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు అనంతరం జరిగిన కార్యక్రమంలో సంఘంజిల్లా కౌన్సిల్ అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ మండలశాఖ పనితీరుపైనే సంఘం నిర్మాణం, అభివృద్ధి ఆధారపడి ఉంటుందన్నారు. ఎన్నికల అధికారిగా కె.సంధ్యారాణి వ్యవహరించారు. కార్యక్రమంలో బి.వీరభద్రం, సత్యనారాయణరెడ్డి, రవికిషోర్, పాల్గొన్నారు

పేరు ఎలా వచ్చిందంటే..

చర్చి కాంపౌండ్



ఖమ్మం సాంస్కృతికం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని ప్రధాన కూడళ్లలో చర్చ్ కాంపౌండ్ ఒకటి.. పురాతన కూడలి కావటంతో చర్చ్ కాంపౌండ్ ఖమ్మం నగరానికే కాకుండా జిల్లా వ్యాప్తంగా అందరికీ సుపరిచితం.. పట్టణం ఏర్పడిన తొలినాళ్లలో ఈప్రాంతం శివారుగా ఉన్నప్పటికీ ప్రస్తుతం నగరం నడిబొడ్డుగా అత్యంత అభివృద్ధి ప్రాంతంగా అలరారుతోంది. ఒక వైపు బోనకల్ రోడ్, మరో వైపు జమ్మిబండ రోడ్, మరో వైపు ఫ్లైవోవర్, కమాన్ బజార్ రోడ్‌లతో ఈ కూడలి ప్రముఖంగా ఉంది.

స్థానికంగా ఉన్న వందేళ్ల పైబడిన చర్చ్ కారణంగా ఈ ప్రాంతానికి ఆ పేరు వచ్చింది. చర్చ్ కాంపౌండ్‌లో క్రైస్తవులు అధికంగా ఉన్నప్పటికీ ఇతర మతాలు వారు సైతం ఉన్నారు. ఇక్కడ ఉన్న చర్చ్ ఎంత ప్రముఖమో సమీపంలోనే ఉన్న ముత్యాలమ్మ దేవాలయం అంత ప్రసిద్ధి కావటం గమనార్హం. మతాలకు అతీతంగా ప్రజలందరూ అన్యోన్యంగా ఉండటం ఈ ప్రాంతం మరో ప్రత్యేకత. నగరంలోని ప్రముఖ కూడలి కావటంతో ఈ కూడలిలో ట్రాఫిక్ రద్దీ కూడా అధికంగానే ఉంటుంది. ఫ్లైవోవర్లకు కనెక్టివిటీగా ఉండటంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు అధికంగారాక పోకలుసాగించే ప్రాంతంగా ఉంది.



ఆంధ్రజ్యోతి
● మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ
● వైరా, కొణిజర్ల, కారేపల్లి, ఏన్కూరు, జూలూరుపాడు
● సత్తుపల్లి, కల్లూరు, తల్లాడ, వేంసూరు, పెనుబల్లి
ZONE
గురువారం 7 నవంబరు 2024
వైరా-మధిర
8 సత్తుపల్లి
WYRA, MADHIRA, SATHUPALLY

సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

కారేపల్లి నవంబరు6(ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్‌కు సమీపంలోని పాత పోలీసు స్టేషన్ భవనం పూర్తిగా శిథిలమైందని, దాని స్థానంలో గెస్ట్‌హౌస్ ఏర్పాటు చేయిస్తానని ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ అన్నారు. బుధవారం ఆయన పాత పోలీసుస్టేషన్ భవనాన్ని పరిశీలించారు. అలాగే కారేపల్లి బస్టాండ్ సెంటర్లో రెండేళ్ల క్రితం నిర్మాణం పూర్తైనా ప్రజా మరుగుదొడ్లను ప్రారంభించాలని ఎంపీడీవో సురేందర్‌ను ఆదేశించారు. అదే విధంగా డాక్టర్ సామినేని రాఘవులు కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన సీతామార్టును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈకార్యక్రమంలో మార్టు అధినేత నల్లమల్ల వెంకటేశ్వర్లు, రమేష్, ముక్క సీతారాములు, బాణోత్ రాంమూర్తి, పగడాల మంజుల, తదితరులున్నారు.

‘సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోకండి’



సమావేశంలో మాట్లాడుతున్న టౌన్ ఎస్ఐ సంధ్య

మధిర, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సైబర్ మోసగాళ్ల ఉచ్చులోపడి యువత మోసపోవద్దని టౌన్ ఎస్ఐ సంధ్య యువతీ, యువకులకు సూచించారు. బుధవారం మధిరలోని ట్యాంక్ బండ్ వద్ద యువతీ యువకులకు సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. షీ టీమ్స్, సైబర్ నేరాలపై, గంజాయి డ్రగ్స్ మత్తు పదార్థాలను అరికట్టేందుకు పోలీస్‌శాఖ పటిష్ఠంగా పనిచేస్తుందని తెలిపారు. అయినా సైబర్ మోసగాళ్ల వల్ల యువత మోసాలకుగురికావడం జరుగుతుందని ముఖ్యంగా ఈ విషయాలపై అవగాహన ఏర్పరుచుకోవాలని సూచనలు చేశారు. వేధింపులపై 100కి సమాచారం ఇవ్వాలని సూచనలు చేశారు. అలాగే యువతకు చెడు వ్యసనాల భారీపడకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్విమ్మర్స్ సభ్యులు, యువతీ, యువకులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్‌లే దిక్కు..

» పలు గ్రామాల్లో ఖాళీగా దర్శనమిస్తున్న పంచాయతీ కార్యదర్శుల పోస్టులు



ముసలిమడుగు పంచాయతీ కార్యాలయం

వైరా, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాలుగు గ్రామపంచాయతీల్లో సెక్రటరీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అక్కడ ఇన్‌చార్జి సెక్రటరీలే దిక్కుగా ఉన్నారు. దీంతో పంచాయతీల్లో పారిశుధ్యం, వీధిలైట్లు, తాగునీటి సరఫరా వంటి అనేక సమస్యలతో కునారిల్లుతున్నాయి. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా రెండు నెలల కిందట ఒక్క ఖమ్మం జిల్లాలోనే ఓ మంత్రి ఆదేశాలతో ఉన్నపళంగా పంచాయతీ కార్యదర్శుల మూకుమ్మడి బదిలీలు జరిగాయి. తమ బదిలీలకు కౌన్సిలింగ్ అవకాశాన్ని కల్పించాలని పంచాయతీ కార్యదర్శులు జిల్లా కలెక్టర్‌కు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండాపోయింది. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అలాగే ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో పంచాయతీ కార్యదర్శుల పూర్వపు పరిచయాలు, ప్రమేయాన్ని తగ్గించాలనే భావనతో సదరు మంత్రి పంచాయతీ కార్యదర్శి బదిలీలకు ఆదేశించడం, ఆవెంటనే బదిలీలు జరిగిపోయాయి. అయితే కొంతమంది కార్యదర్శులు ఏడాదిలోపు ఉద్యోగ విరమణ చేయనుండడం, కొంత మంది కార్యదర్శుల భార్యభర్తల బదిలీలకు సంబంధించి మళ్లీ సర్దుబాటు చేశారు. ఈ నేపథ్యంలోనే వైరా మండలంలోని విప్పలమడక పంచాయతీ సెక్రటరీ సత్తుపల్లి మండలానికి బదిలీపై వెళ్లారు. గరికపాడు సెక్రటరీ విప్పలమడక ఇన్‌చార్జి సెక్రటరీగా పనిచేస్తున్నారు. ఖాళీగా ఉన్న స్టేజీ పినపాక పంచాయతీకి సిరిపురం సెక్రటరీ ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గొల్లెనపాడు సెక్రటరీ పోస్టు ఖాళీగా ఉంది. అష్టగుర్తి సెక్రటరీ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. ముసలిమడుగు సెక్రటరీగా ఉన్న కృష్ణ రెండేళ్ల కిందట ఏదులాపురానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో అక్కడి సెక్రటరీ పాషాను నియమించారు. ఆయన కొన్నికారణాలతో సస్పెన్షన్‌లో ఉండి, ఆతర్వాత తిరిగి పోస్టు దక్కించుకున్నప్పటికీ ఇంతవరకు ముసలిమడుగులో బాధ్యతలు చేపట్టలేదు. ఈ విషయాన్ని వైరా ఎంపీవో జ్యోత్స్న డీపీవోకు నివేదించారు. కొండకొడిమ సెక్రటరీ ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ నాలుగు గ్రామాల్లో ఈ కార్యక్రమ అమలును ఇన్‌చార్జ్ సెక్రటరీలు పర్యవేక్షించడం భారంగా మారింది. ఇప్పటికైనా వెంటనే ఖాళీ పోస్టుల్లో పూర్తిస్థాయి సెక్రటరీలను నియమించాలని ఆపంచాయతీల ప్రజలు కోరుతున్నారు.

పీవోఎస్ ద్వారా ఎరువులను విక్రయించాలి

● ఏడీఏ కరుణశ్రీ

ఏన్కూరు, నవంబరు6(ఆంధ్రజ్యోతి): ఎరువుల విక్రయాలను డీలర్లు పీవోఎస్ ద్వారానే విక్రయించాలని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు తుమ్మలపల్లి కరుణశ్రీ అన్నారు. స్థానిక రైతు వేదికలో బుధవారం డీలర్ల సమావేశం జరిగింది. ఈసందర్భగా ఆమె మాట్లాడుతూ డీలర్లు తన షాపు లైసెన్సులు, నేమ్‌బోర్డు, స్టాకుబోర్డు, ప్రదర్శించాలన్నారు. ప్రభుత్వం అందించే రాయతీ గురించి రైతులకు వివరించాలని ఏఈవోలను కోరారు. ఈకార్యక్రమంలో ఏవోనరసింహారావు, ఏఈవోలు లహరి, నవ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీఏ కరుణశ్రీ

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

» రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు



ముదిగొండలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాయల

ముదిగొండ, నవంబరు6(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు సూచించారు. బుధవారం ముదిగొండ మండలలంలో కృష్ణాపురాం కమలాపురం, మేడేపల్లి, కట్టకూరు, గోకినపల్లి గ్రామాల్లో సొసైటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమాల్లో జిల్లా, మండల కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కొమ్మినేని రమేష్, సొసైటీ చైర్మన్లు తుపాకుల యలగొండస్వామి, సామినేని వెంకటేశ్వరరావు, ఏడీఏ విజయ్‌చంద్ర, సీఈవోలు వెంకటరెడ్డి, శ్రీనివాసరావు, పుల్లారెడ్డి, నాయకులు పసుపులేటి దేవేంద్రం, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

సత్తుపల్లిరూరల్, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన వరి ధాన్యాన్ని దళారులకు అమ్మకుండా ప్రభుత్వం అనుమతి ఇచ్చిన కేంద్రాలకే విక్రయించి రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ అన్నా రు. ఐకేపీ ఆధ్వర్యంలో మండలంలోని కిష్టారంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం బుధవారం ప్రారంభిచారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం కేవీ.సుబ్బారావు, ఏవో వై.శ్రీనివాసరావు, జీపీసీ సెక్రటరీ మద్దెల రవి, సీసీ నరేందర్, వీవో సభ్యులు కృష్ణకుమారి, విజయకుమారి, రాజేశ్వరి, అరుణ, జమలమ్మ, ధనలక్ష్మీ, రాణీ తదితరులున్నారు.

పెనుబల్లి, నవంబరు6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎడ్లబంజర గ్రామంలో బుధవారం ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతు సోమరాజు ప్రసాదరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో భవానీ, ఐకేపీ సీపీ ప్రసాద్, గ్రామదీపిక దుర్గా, రైతులు గోపిశెట్టి సుబ్బారావు, ఎడ్ల సుబ్బారావు, నర్సింహారావు, రాము తదితరులున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఎర్రుపాలెం, నవంబరు6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆపార్టీ ఆధ్వర్యంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం లబ్ధిదారులకు అందించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సిఫార్సుతో మంజూరైన రూ.3,05,000 విలువగల సీఎంఆర్ఎఫ్ చెక్కులను వివిధ గ్రామాలకు చెందిన 8మంది లబ్ధిదారులకు మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి అందించారు. ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బండారు నరసింహారావు, శీలం శ్రీనివాసరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జిలు యన్నం పిచ్చిరెడ్డి, కంచర్ల వెంకటనరసయ్య, పిల్లి బోసుబాబు, నాయకులుఅనుమోలు వెంకటకృష్ణారావు, మండల మైనారిటీసెల్ అధ్యక్షుడు షేక్ జానీబాషా, మండల ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ దేవరకొండ శ్రీనివాసరావు ,సీనియర్ నాయకులు బొగ్గుల శ్రీనివాసరెడ్డి,పసుపులేటి వెంకటనారాయణ పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి

» లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు



స్టేషన్ సిబ్బందితో మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు

కొణిజర్ల, నవంబరు6(ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులపై వెంటనే స్పదించాలని లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు సూచించారు. బుధవారం కొణిజర్ల పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్ నిర్వాహణ, పోలీస్‌ల పనితీరు, సెక్టార్ అధికారుల విచారణ నివేదికలు, జనరల్ డైరీ రికార్డులను పరిశీలించారు. మండలంలోని శాంతిభద్రతలు, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకొని సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. సీసీటీవీ కెమెరాలు నిత్యం పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ సూరజ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో రాజకీయ జోక్యం తగదు: సీపీఎం

ముదిగొండ, నవంబరు6(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో రాజకీయ జోక్యం తగదని సీపీఎం జిల్లా నాయకుడు వాసిరెడ్డి వరప్రసాద్, మండల కార్యదర్శి బట్టు పురుషో త్తం పేర్కొన్నారు. బుధవారం స్థానిక మచ్చా వీరయ్య భవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక కమిటీలో అధికార పార్టీ నాయకులు తమ మద్దతుదారులతో అవినీతి, అక్రమాలకు పాల్పడే అవకాశముందని ఆరోపించారు. గ్రామసభల ద్వారానే ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక జరగాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మంకెన దామోదర్, టీఎస్.కల్యాణ్, భద్రయ్య, నాగేశ్వరరావు, మందరపు పద్మ, బట్టు రాజు, శ్రీనివాస్, ఉపేందర్ పాల్గొన్నారు.

తల్లాడ సొసైటీ కార్యాలయంలో సీఐ విచారణ

తల్లాడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తల్లాడ సొసైటీ కార్యాలయంలో బుధవారం వైరా సీఐ ఎన్.సాగర్ రూపేకార్డుల చోరీపై విచారణ నిర్వహించారు. 2018వ సంవత్సరంలో 719మంది రైతుల రూపేకార్డులను మల్లవరం గ్రామానికి చెందిన దుగ్గిదేవర వెంకటకృష్ణారావు, బెల్లంకొండ చిన్నసైదులు అపహరించి రూ.40.56లక్షలు నగదును డ్రా చేసిన విషయమై సీఈవో నాగబాబును వివరాలు అడిగి తెలసున్నారు. కార్యక్రమంలో ఎస్ఐ బి.కొండల్‌రావు పాల్గొన్నారు.

ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభం

మధిరటౌన్, నవంబరు6(ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వే స్టిక్కరింగ్ కార్యక్రమాన్ని బుధవారం మధిర మునిసిపాలిటీ పరిధిలోని రెండవ వార్డులో తహసీల్దార్ రాంబాబు, మునిసిపల్ చైర్‌పర్సన్ మొండితోక లత ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ సంపత్ కుమార్, కౌన్సిలర్ ఇక్బాల్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

దెందుకూరు గ్రామంలో ఇంటింటి సర్వే పరిశీలన

మధిరరూరల్, నవంబరు6(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కార్యక్రమాన్ని బుధవారం మధిర మండల అధికారులు పలు గ్రామాల్లో పర్యవేక్షించారు. దెందుకూరు గ్రామంలో తహసీల్దార్ రాంబాబు, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీవో టీవీఎల్ఎన్.శాస్త్రీ సర్వే జరుగుతున్న తీరును పరిశీలించారు.



సర్వే కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, కాంగ్రెస్ నాయకులు

మెస్ చార్జీల పెంపుపై హర్షం

వైరా, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మెస్, కాస్మోటిక్, చార్జీలు పెంచటం పట్ల ఖమ్మం జిల్లా తెలంగాణ గురుకుల పేరెంట్స్ అసోసియేషన్(టీజీపీఏ) కమిటీ హర్షం వ్యక్తం చేసింది. బుధవారం వైరాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ సమావేశాన్ని నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు. గురుకుల ప్రిన్సిపాల్ డి.సమత, టీజీపీఏ రాష్ట్ర, జిల్లా నాయకులు కోట లోకేష్, పరకాల విజయకుమారి, గొల్లమందల శ్రీనివాస్, పొట్టపింజిర చిట్టిబాబు, పోతుల సుదర్శన్, ముత్యాల రాజు, చప్పిడి అనూష, వెంకట్రావ్, మాతంగి అనిల్‌కుమార్, దర్శి కిరణ్‌కుమార్, బోయిళ్ల నాగరాజు, తదితరులున్నారు.

స్కూల్ బ్యాగుల పంపిణీ

ఏన్కూరు, నవంబరు6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బురదరాఘవాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు రూ.30 వేల విలువైన స్కూల్ బ్యాగులను సహజ ఫౌండేషన్ హైదరాబాదు ద్వారా ఉచితంగా బుధవారం అం దించారు. ఈస్కూల్ బ్యాగులను ఎంఈవో శ్రీనివాసరావు, ఎస్ఐ రఫీ, ఎంపీడీవో ఎస్.రమేష్ లు అందించారు. సహజ ఫౌండేషన్ ద్వారా బ్యాగుల పంపిణీకి కృషి చేసిన ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సాగి సుజాతను అభినందించారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పొట్ట రామారావు, విజయశ్రీ, శ్రీనివాసరావు, పుల్లయ్య, భాస్కర్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మొబైల్ రికవరీ

ఏన్కూరు, నవంబరు6(ఆంధ్రజ్యోతి): చోరీకి గురైన ఫోన్‌ను రికవరీ చేసి బాధితుడికి బుధవారం పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ రఫీ అందించారు. ఏన్కూరుకు చెందిన ఓ వ్యక్తి రెండు నెలల క్రితం సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. బాధితుడు వెంటనే స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ యాప్ ద్వారా మొబైల్‌ను గుర్తించి జూలూరుపాడు మండలంలోని ఓవ్యక్తి నుంచి స్వాధీనం చేసుకొని బాధితుడికి అప్పగించారు.

తెలంగాణలో అధికారం కోసం కృషి చేయాలి

» బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పాపారావు

మధిర, నవంబరు6(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో అధికారం కోసం ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు శీలం పాపారావు పిలుపునిచ్చారు. బుధవారం బీజేపీ సభ్యత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మధిరలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రపంచంలో అదిపెద్ద పార్టీగా బీజేపీ నిలిచిందన్నారు. ప్రజలు ముఖ్యంగా యువత పార్టీలో చేరేందుకుముందుకు రావడం సంతోషదాయంగా పేర్కొన్నారు. పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేంత వరకు ప్రతి కార్యకర్త శక్తివంచనలేకుండా కృషి చేయాలని సూచనలు చేశారు. సభ్యత్వ నమోదులో ముందుండాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చిలువేరు సాంబశివరావు, పట్టణ అధ్యక్షులు పాపట్ల రమేష్, కుంచం కృష్ణారావు, దేవరకొండ కోటేశ్వరరావు, గడ్డం శ్రీహరి, పగడాల నాగేంద్రబాబు, రామకృష్ణ, తదితరులున్నారు.

కల్లూరు వేణుగోపాలస్వామి ఆలయ చైర్మన్‌గా రంగా..?



కల్లూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని సంతాన వేణుగోపాలస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా దారా రంగా నిమితులయ్యారని తెలిసింది. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అనుచరుడిగా గుర్తింపు పొందిన కాం గ్రెస్ యువనాయకుడు దారా రంగాను ఆలయ కమిటీ చైర్మన్‌గా ఎంపిక చేస్తూ ఈ మేరకు ఎమ్మెల్యే రాష్ట్ర దేవదాయశాఖ కార్యాలయానికి ప్రతిపాదనలు పంపారని అధికార పార్టీ నాయకుల ద్వారా తెలిసింది. దేవాదాయ శాఖ నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే త్వరలోనే వేణుగోపాలస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా ఆయనతో పా టుగా పాలక మండలి సభ్యులందరూ ప్రమాణ స్వీకారం చేసే అవకాశాలు ఉన్నాయని తెలిసింది.

‘పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి’

వైరా, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అపరిష్కృతంగా ఉన్న పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని పెన్షనర్లు కోరారు. బుధవారం తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ విశ్రాంత పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం డివిజన్ సభ్యులు వైరా ఖజానా అధికారి ప్రసన్నకుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నెల్లూరి వీరబాబు, కె.వెంకటేశ్వరరావు, ఎన్ఎస్‌పీ.ప్రసాద్, రవికుమార్ తదితరులున్నారు.

మధిర, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పెన్షన్‌దారుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, ప్రభుత్వ అనుసరిస్తున్న నిర్లక్ష్యదోరిణికి నిరసనగా మధిర డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో అన్ని శాఖల పెన్షన్‌దారులు బుధవారం మధిర సబ్ ట్రెజరీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి మీరాఖాన్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న అన్నిరకాల బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి ఆంజనేయులు, ఎం.ఆశీర్వాదం, ఆర్.లక్ష్మణరావు, సుబ్బరాజు, కస్తూరిబాయి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

బోనకల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముష్టికుంట్ల గ్రామం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో టిప్పర్ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. వివరాల ప్రకారం..ఖమ్మం నుంచి కంకర్ లోడ్‌తో టిప్పర్ బోనకల్ వైపునకు వస్తుంది. ఇదే క్రమంలో విజయవాడ నుంచి ఖమ్మం వైపునకు వెళ్తున్న కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో టిప్పర్ డ్రైవర్ సుభాష్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

తేమశాతం తక్కువగా ఉండేలా చూసుకోవాలి

» తహసీల్దార్ సంపత్

కారేపల్లి నవంబరు6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రానికి రైతులు తీసుకవచ్చే పత్తిలో తేమశాతం లేకుండా చూడలని తహసీల్దార్ ఎస్.సంపత్‌కుమార్ అన్నారు. బుధవారం సీసీఐ కేంద్రంలో విక్రయానికి వచ్చిన పత్తి వాహనాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఆయన వెంట రైతులు, ఉన్నారు.

నేడు చింతకానిలో డిప్యూటీ సీఎం భట్టి పర్యటన

చింతకాని, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలో నేడు, రేపు రెండు రోజుల పాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పర్యటించనున్నారు. నాగులవంచ, నాగిలిగొండ, పందిళ్లపల్లి గ్రామాల్లో సుమారు రూ.30 కోట్లతో నిర్మాణం చేపట్టనున్న పలు గ్రామీణ లింకు రోడ్లకు శంకుస్థాపన చేయనున్నారు. కార్యక్రమంలో ప్రజలు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

ధాన్యం కల్లాల స్థలం ఏర్పాటు

కల్లూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వానకాలం సీజన్‌లో దిగుబడి అయిన ధాన్యాన్ని అరబెట్టుకునేందుకు అనువైన విధంగా కల్లూరు పట్టణంలో ఏఎంసీ చైర్మన్ బాగం నీరజాచౌదరి చొరవతో బుధవారం ప్రభుత్వ స్థలాల్లో కల్లాలను ఏర్పాటు చేయించారు. కల్లూరు పరిసర ప్రాంతంలో ధాన్యం రాశులను అరబెట్టుకునేందుకు పొలాల్లో కల్లాలు లేక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని పాత బస్టాండు (ఆర్‌అండ్‌బీ)లో మూడు ఎకరాల స్థలాన్ని ఎంపిక చేసి ఎక్స్‌కవేటర్‌తో భూమిని సమాంతరంగా చేయించారు. త్వరలో రైతులకు అందుబాటుతో పాటుగా మద్దతు ధర కూడా పొందేలా ఏఎంసీ తరుపున ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరగుతుందని నీరజదేవి తెలిపారు. ప్రభుత్వం తరుపున విశాలమైన స్థలంలో కల్లాం కేంద్రాన్ని ఏర్పాటు చేయడం పట్ల రైతులు ఏఎంసీ చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



గురుకుల విద్యార్థుల మెస్‌చార్జీలు పెంచిన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపిన మునసలమడుగు, వైరా ఎంజేపీ గురుకుల విద్యార్థులు

పార్టీ బలోపేతమే ధ్యేయంగా పని చేయాలి

● టీడీపీ పార్లమెంటరీ కన్వీనర్ వాసిరెడ్డి రామనాథం



టీడీపీ జెండాను ఆవిష్కరిస్తున్న వాసిరెడ్డి రామనాథం

బోనకల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పార్టీ బలోపేతమే ధ్యేయంగా ప్రతి ఒక్కరు పని చేయాలని టీడీపీ పార్లమెంటరీ కన్వీనర్ వాసిరెడ్డి రామనాథం సూచించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ముందుగా పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ సభ్యత్వం తీసుకోవడం ద్వారా రూ. 5లక్షల బీమాను వర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ రావుట్ల సత్యనారాయణ, మలాది హనుమంతరావు, బాగం రమేష్, మైనేని రవి కుమార్, తూము పురుషోత్తం, రావూరి మంగయ్య, మామిళ్ల నర్సింహరావు, బందం అనిల్, చావా హన్మంతరావు తదితరులున్నారు.

వృత్తి విద్యాకోర్సులతోనే త్వరగా స్థిరపడతాం

» కాకతీయ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కూసంపూడి మధుసూదనరావు

సత్తుపల్లి, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తాము జీవితంలో త్వరగా స్థిరపడాలంటే వృత్తి విద్యాకోర్సులతోనే సాధ్యమని కాకతీయ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కూసంపూడి మధుసూదనరావు అన్నారు. బుధవారం స్థానిక తేజ ఒకేషనల్, పారామెడికల్ కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలు ఆద్యంతం అలరించాయి. ఈ సందర్భంగా ఒకేషనల్ డైరీ కోర్స్ చదివి ప్రభుత్వ ఉద్యోగం సాధించిన పూర్వ విద్యార్థులు కటకం శ్రీహరిబాబు, ఎం.మౌనిక, జీ.జోసెఫ్ తంబీలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చైర్మన్ జీ.వీరారెడ్డి, డైరెక్టర్ జీ.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ సీహెచ్.ప్రభాకరరావులతో పాటు పాలా ప్రవీణ్‌రెడ్డి, ఎం.శ్రీధర్, సీహెచ్.సుబ్బారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులతో కలిసి భోజనం చేసిన అధికారులు

బోనకల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముష్టికుంట్ల ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులతో కలిసి అధికారులు మధ్యాహ్న భోజనం చేశారు. తహసీల్దార్ పున్నమ్ చందర్, ఎంపీడీవో ఆర్. రమాదేవి, ఎంఈవో దామాల పుల్లయ్యలు పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులతో పాటు కింద కూర్చోని రుచి చూశారు. చదువుతో పాటు భోజన నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. మెను ప్రకారం పిల్లలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు.

క్యాన్సర్‌పై అవగాహన

కారేపల్లి, నవంబరు6(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమారి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో యువరాజ్ భారత క్రికెటర్ ఏర్పాటు చేసిన ఆర్గనైజేషన్ సంస్థ నుంచి పాల్గొన్న డాక్టర్ షవానాజ్ విద్యార్థులకు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఏజీఎం సుధారాణి, రాజ్యలక్ష్మి, కవిత, కృష్ణవేణి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కల్లూరు, నవంబరు6(ఆంధ్రజ్యోతి): కల్లూరులో క్యాన్సర్ బారీన పడి అనారోగ్యంతో బాధపడుతున్న ఎడవెల్లి రాము కుమార్తె సరితకు కాంగ్రెస్ నాయకుడు లక్కినేని రమేష్ కొంత సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దామాల రాజు, ఉబ్బన శ్రీను, ముత్తామాల రాందాసు, షేక్ అఫ్రోజ్, సీపీఎం నాయకుడు దామాల దయాకర్, బీసీ సంఘం నాయకుడు బయ్యారపు నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

మధిరరూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని దెందుకూరు పీహెచ్‌సీ వైద్యాధికారి పృథ్వీరాజ్‌నాయక్ సూచించారు. బుధవారం మధిర మునిసిపాలిటీ పరిధిలోని మడుపల్లి ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాలలో మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం తోట నర్సింహారావు, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, లీలా, సునీల, లంకా కొండయ్య పాల్గొన్నారు.

అమరులు, పోరాట యోధులకు విప్లవ జోహార్లు

సత్తుపల్లి, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): భూమి, భుక్తి, విముక్తి కోసం, పేద ప్రజల సమస్యల కోసం పోరాడి అమరులైన పోరాట యోధులకు విప్లవ జోహార్లని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు అన్నారు. అమరవీరుల స్మారకం సందర్భంగా బుధవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌కే.ఉమర్, కృష్ణ, ఆదినారాయణ, సురేష్, చంద్రం, నరసింహారావు, మల్లయ్య, రాఘవులు, వెంకటేశ్వర్లు, నాగరాజు, రామస్వామి, తిరుపతమ్మ, జయమ్మ, ఈదమ్మ, రాధా, రమక్క, లక్ష్మక్క తదితరులు పాల్గొన్నారు.